
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 10 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.7	26.7
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	28
కందుకూరు	37	28





దేశ సంరక్షణ, శత్రు వినాశనం కోసం శుక్రవారం నగరంలోని మూలాపేటలోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు శ్రీరామ రుద్ర పారాయణం చేశారు. ప్రభుత్వానికి, సైనికులకు మద్దతుగా ప్రత్యేక పూజలు చేశారు.

పోలీసుల అప్రమత్తం

● జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

నెల్లూరు (క్రైం) : ఓ పక్క పాకిస్థాన్‌పై యుద్ధం.. మరోపక్క కేంద్ర ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటనతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేస్తూ రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నాయి. పాక్‌తో యుద్ధం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలు, లాడ్జీల తనిఖీలను ముమ్మరం చేశారు. ఇక జిల్లా పరిధిలోని తీర ప్రాంతాలపై మెరైన్, స్థానిక పోలీసుల సహకారంతో నిఘా నేత్రం ఉంచారు. ఎస్పీ జి కృష్ణకాంత్ శుక్రవారం కృష్ణపట్నం పోర్టు, జెన్‌కోలను పరిశీలించి పలు అంశాలపై అధికారులతో సమావేశం అయ్యారు.

● తీర రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం : ఎస్పీ

ముత్తుకూరు : తీర రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. దేశ సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తీర ప్రాంతాల్లో అప్రమత్తమై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించేందుకు శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్టు, జెన్‌కో అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. పోర్టు, జెన్కో థర్మల్ కేంద్రం భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. తీర ప్రాంతాలపై యుద్ధ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరి సహకారంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టి, నిఘా ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్, జెన్‌కో సీఈ మధుసూదన్ రావు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



జెన్‌కో అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

"ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారు. మన ఆడపడుచుల పసుపు, కుంకుమను తీసేసిన వారిపై మనోళ్లు ప్రతీకారం తీసుకున్నారు. ఇంతటి క్షోభకు కారణమైన పాకిస్థాన్‌నూ వదిలి పెట్టకూడదు. ఈ యుద్ధంలో మా వాళ్లు పాలుపంచుకోవడం ఎంతో గర్వంగా ఉంది. అలాగని భయంగా కూడా ఉంది.' అంటూ దేశ సరిహద్దులో శత్రు దేశంతో పోరాడుతున్న మన జవాన్ల తల్లిదండ్రులు భావోద్వేగంగా అంటున్నారు. 'దేశం కోసం మా వాళ్ల పోరాటం మాలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది.' అని కన్నీటి చెమ్మను తుడుచుకుంటూ చెబుతున్నారు. దేశ సరిహద్దులో పోరాడుతున్న సైనికుల్లో జిల్లాకు చెందిన వారూ ఉన్నారు. అలాంటి వారి బంధువులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

భయంగా ఉన్నా.. గర్విస్తున్నాం!

ఉగ్రవాదాన్ని పూర్తిగా అణిచేయాలి

పాక్‌కు సరైన బుద్ధి చెప్పాలి

'ఆంధ్రజ్యోతి'తో సైనిక కుటుంబసభ్యులు

దేశం కోసం పోరాడుతున్నాడు!



మహేశ్ తల్లిదండ్రులు నరసింహులు, వెంకటమ్మ

మా అబ్బాయి తోట మహేశ్ ఐదేళ్ల క్రితమే భారత ఆర్మీలో చేరాడు. దేశం కోసం పోరాడుతున్నందుకు మాకు గర్వంగా ఉంది. యుద్ధం సన్నామాలు మొదలైన నాటి నుంచి మాకు రోజు ఫోన్ చేసి మాట్లాడుతున్నా డు. ఇప్పుడు జమ్మూ కశ్మీర్ సరిహద్దులో ఉంటున్నట్లు చెప్పాడు. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు, దేశం కోసం పోరాడుతున్న మా మహేశ్‌ను చూసి గర్వపడుతున్నాము.

- తోట నరసింహులు, వెంకటమ్మ, సీతారామపురం

పట్టుబట్టి చేరాడు!



మాది చేనేత పేద కుటుంబం. మా కుమారులు రంగనాయకులు, రంగనాథంలను కష్టపడి చదివించాం. రెండో అబ్బాయి రంగనాథం పట్టుబట్టి మమ్మల్ని ఒప్పించి ఆర్మీలో చేరాడు. ఆర్మీలో జవాన్‌గా సెలెక్ట్ అయి ట్రైనింగ్ పూర్తి చేసుకుని 2004లో తొలి పోస్టింగ్ రాజస్థాన్‌లో చేరాడు. పోయిన సంక్రాంతికి ముందు వచ్చాడు. నెలన్నర కిందటే డ్యూటీ కి వెళ్లాడు. ప్రస్తుతం యుద్ధం జరుగుతుండటం, ఇందులో మా రంగనాథం పాల్గొనడం గర్వంగా ఉంది. కశ్మీర్ పర్యాటకులపై దాడి చేసి చంపిన ఉగ్రవాదులను మన సైనికులు మట్టుబెట్టడంతో సంబరపడ్డాం. దేశ ప్రజలందరూ మన సైనికులను కీర్తిస్తుండటం అందులో మావాడు ఉండడంతో చాలా గర్వంగా ఉంది.

- వింజమూరి రంగస్వామి, వెంగటమ్మ, సంగం

మాకే ధైర్యం చెబుతున్నాడు!



సురేష్ తల్లి విజయమ్మ, భార్య జ్యోతి, పిల్లలు

కలువాయి మండలం మాదన్నగారిపల్లెకు చెందిన ఆవుల వెంకటసుబ్బయ్య, విజయమ్మల కుమారుడు ఆవుల సురేష్ 12 ఏళ్లుగా బీఎస్ఎఫ్‌లో జవానుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పంజాబ్‌లో కూడా పని చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో మూడేళ్ల సర్వీసు పూర్తికావడంతో ఇటీవల కశ్మీర్‌కు బదిలీ చేశారు. నెల రోజులు సెలవులు తరువాత కశ్మీరులో జాయిన్ కావాల్సి ఉంది. అయితే, యుద్ధం నేపథ్యంలో సెలవులు రద్దు చేయడంతో అరుణాచల్ ప్రదేశ్‌లోనే ఉంటున్నారు. ఈ సందర్భంగా సురేష్ తల్లి ఆవుల విజయమ్మ, భార్య జ్యోతి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు 'మనదేశం కోసం సరిహద్దులో విధులు నిర్వహిస్తూనే మాకు ఫోన్‌లో అనుక్షణం ధైర్యం చెబుతున్న మా కుమారుడిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. ప్రతి రోజూ మాకు ఫోన్ చేసి ఎంతో ధైర్యం చెబుతున్నాడు. మీరు భయపడకండి ఏమీ కాదు అంటూ సురేష్ చెబుతున్న మాటలు ఎంతో గర్వంగా ఉన్నాయి.'

మాకెంతో చాలా గర్వంగా ఉంది!



మా ఆయన మాధవరావు 28 ఏళ్లుగా కశ్మీర్‌లో సైనికుడిగా పని చేస్తున్నాడు. ఇక ఆయనకు ఒక్క ఏడాది మాత్రమే సర్వీస్ ఉంది. ఈ ఏడాదిలోనే ప్రమోషన్ కూడా వస్తుంది. నేను కూడా నా భర్తతో కలిసి నాలుగేళ్లు కశ్మీర్‌లోనే ఉన్నాను. పిల్లల చదువుల కోసం స్వగ్రామానికి వచ్చేశాను. నాలుగైదు రోజులకోసారి ఆయన నాతో ఫోన్‌లో మాట్లాడుతుంటాడు. నన్ను ఫోన్ చేయవద్దంటాడు ఆయనే నాకు ఫోన్ చేస్తాడు. వాట్సాప్ కాల్, వీడియో కాల్ చేయమంటే అలా చేయకూడదని వాయిస్ కాల్ చేస్తుంటాడు. పాకిస్థాన్‌తో యుద్ధం సన్నాహాలు మొదలైన తరువాత కూడా రెండు రోజులకోసారి ఫోన్ చేసి 'నువ్వు భయపడవద్దు. మన భారతీయులను పాక్ సైన్యం ఏం చేయలేరని ధైర్యం చెబుతుంటాడు. ఉగ్రదాడిలో అమాయకులను పొట్టన పెట్టుకోవడం దారుణం. ఆ తర్వాత మన సైన్యం ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడం ఆనందంగా ఉంది. దేశ ప్రజల రక్షణ కోసం నా భర్త యుద్ధం చేయడం గర్వంగా ఉన్నా మరోపక్క భయంగా కూడా ఉంది.

- ఇరపని అంజలి, వలేటివారిపాళెం

గట్టిగా బుద్ధి చెప్పాలి



కోటయ్య తలిదండ్రులు, భార్య, పిల్లలు

'మావాడు మిలటరీలో చేరి దేశానికి సేవ చేయడం, దేశ రక్షణలో పాలు పంచుకోడం చాలా గర్వంగా ఉంది. అయితే, ఇప్పుడు జరుగుతున్న యుద్ధం వల్ల కొంత భయంగానూ ఉంది.' అని లింగసముద్రంకు చెందిన జాలయ్య, ఆదిలక్ష్మి దంపతులు అన్నారు. వీరి కుమారుడు తిరుమలశెట్టి కోటయ్య అరుణాచల్‌ప్రదేశ్‌లో హవల్దార్‌గా పని చేస్తున్నారు. యుద్ధం సందర్భంగా కోటయ్య తల్లిదండ్రులతోపాటు భార్య కోటేశ్వరి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'యుద్ధం వల్ల మేము భయపడుతుంటామని కోటయ్యే ఫోన్ చేసి మాట్లాడుతుంటాడు. మా యోగక్షేమాలు అడగడంతోపాటు ధైర్యం చెబుతుంటాడు. ఈ యుద్ధంతోనైనా పాకిస్థాన్ కళ్లు తెరవాలి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలి. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులను కాల్చి చంపి, మన ఆడోళ్ల సిందూరాన్ని తుడిపేశారు. అలాంటి వారికి ఈ యుద్ధంతో గట్టిగా బుద్ధి చెప్పాలి.' అని అన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



శేషవాహనంపై ఊరేగుతున్న పెంచల నృసింహుడు

దేవతలారా తరలిరండి!

● పెంచలస్వామి ఉత్సవాలకు ఆహ్వానం

● కోనలో వేడుకగా ధ్వజారోహణం

రాపూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : దేవతలరా తరలిరండి.. శ్రీవారి ఉత్సవాలను విజయవంతం చేయండి. అంటూ సకల దేవతలకు వేద పండితులు ఆహ్వానం పలికారు. పెంచలకోన క్షేత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గరుత్మంతుడికి ప్రత్యేక పూజలు చేసి క్షేత్రోత్సవం చేశారు. ఆలయ అర్చకులు ధ్వజస్తంభానికి దర్భాలు కట్టి విశేష పూజలు చేశారు. అనంతరం గరుత్మం తుడి చిత్రాన్ని ధ్వజస్తం భంపై ఎగర వేశారు. వివిధ రకాల ద్రవ్యాలతో ఉత్సవమూర్తులను అభిషేకించారు. కాగా, గరుత్మంతుడికి పూజలు, అభిషేకం చేసిన ప్రసాదాన్ని (కొడిముద్దలు) తీసుకునేందుకు మహిళలు పోటీ పడ్డారు. అనంతరం తన దేవేరులతో కలిసి శ్రీవారు తిరుచ్చిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి తదితరులు పాల్గొన్నారు.

● శేషవాహనంపై కొలువుదీరి..

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు శుక్రవారం రాత్రి శేష వాహనంపై పెంచలస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కోన చుట్టూ మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ

● ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 6 గంటలకు పూలంగి సేవ, 8 గంటలకు హంస వాహనంపై శ్రీవారు విహరిస్తారు. రాత్రి 10 గంటలకు బంగారు హనుమంతు సేవ జరగనుంది.

ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ..

నెల్లూరులో ఎఫ్ఎఫ్‌సీ

ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ పార్క్.... దశాబ్ద కాలంగా ఎటూ తేలకుండా నానుతున్న ఈ అంశం ఎట్టకేలకు కార్యరూపానికి చేరుకుంది. అటవీశాఖతో ఏర్పడిన భూ లడాయి తేలిపోయి, 75 ఎకరాలు అప్పగించడంతో పారిశ్రామిక పార్కు పురుడుపోసుకోనుంది. ఇదే సమయంలో నెల్లూరు నగరంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భగత్‌సింగ్ కాలనీలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ రూపుదిద్దుకోనుంది. ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు తగినంత భూమి లేక పోవడంతో కాంప్లెక్స్ నిర్మాణానికి పాలకులు నిర్ణయించారు. ఈ రెండింటికీ నేడు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఇటు నగరంలో ఎఫ్ఎఫ్‌సీ, అటు నగర శివార్లకు అనుకుని ఉన్న ఆమంచర్లలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు పూర్తయితే ఎంతో మంది ఉపాధి లభిస్తుంది.



ఆమంచర్ల వద్ద ఎంఎస్ఎంఈ పార్క్ స్థలంలో శంకుస్థాపనకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

● రూరల్, సిటీ నియోజకవర్గాల్లో ఏర్పాటు

● రెండింటికీ నేడు శంకుస్థాపన

● రూ.19 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

● ఆమంచర్లలో 75 ఎకరాలు అప్పగించిన అటవీ శాఖ

● మొదటి విడతలో 30 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్

● ఔత్సాహికుల కోసం 313 ప్లాట్లు సిద్ధం

● మౌలిక సదుపాయల కల్పన తర్వాత ధర నిర్ణయం

● భగత్‌సింగ్ కాలనీలో 2.4 ఎకరాల్లో కాంప్లెక్స్



భగత్‌సింగ్‌కాలనీ వద్ద ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణానికి సిద్ధమవుతున్న భూమి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగా ఇటీవలే ఆత్మకూరు నియోజకవర్గంలోని నారంపేట ఎంఎస్ఎంఈ పార్క్‌ను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన విషయం తెలిసిందే. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ఏపీఐఐసీ ఆధ్వ ర్యంలో అన్నీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ల కోసం భూములను గుర్తించారు. ఈ క్రమంలో శనివారం నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌లకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూరల్ నియోజకవర్గంలోని ఆమంచర్ల ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని దాదాపు పదేళ్ల క్రితమే ఏపీఐఐసీ భూమిని కొనుగోలు చేసింది. అయితే ఆ భూమి తమదని అటవీశాఖ అడ్డుపడింది. అప్పటి నుంచి ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ పార్క్ కలగా మిగిలిపోయింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డిశ్రీధర్‌రెడ్డి పట్టు వదలకుండా ఆ పార్క్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికి ఆ కల నెరవేరనుంది.

● ఆమంచర్లలో 75 ఎకరాల భూమి కేటాయింపు

ఆమంచర్ల ప్రాంతం నెల్లూరు నగరానికి దగ్గరగా ఉండటం, ప్రస్తుతం నగరంలో ఉన్న ఆటోనగర్‌లో కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో అనేక మంది ఆటోనగర్ పారిశ్రామికవేత్తలు ఆమంచర్లలో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమంచర్ల ఎంఎస్ఎంఈ పార్క్‌కు ఎక్కడలేని డిమాండ్ ఏర్పడనున్నట్లు ఏపీఐఐసీ అధికారులు అభిప్రాయపడ్డారు. 60 ఎకరాల్లో రెండు విడతలుగా ప్లాట్లు అభివృద్ధి చేయనున్నారు. మొదటి విడతలో 30 ఎకరాల్లో 147 ప్లాట్లు, రెండవ విడతలో 30 ఎకరాల్లో 166 ప్లాట్లు సిద్ధం చేసి విక్రయించనున్నారు. మొత్తం మౌలిక సదుపాయల కల్పన తరువాత ప్లాట్ల ధర నిర్ణయించనున్నారు. మొదటి విడత పార్క్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7కోట్లు విడుదల చేసింది. పార్క్ అభివృద్ధి పనులకు శనివారం ఉదయం రూరల్ ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు.

ప్రతీ నియోజకవర్గంలో పార్క్

జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయనున్నాము. ఇప్పటికే 8 నియోజకవర్గాల్లో పార్కులకు అవసరమైన భూమిని గుర్తించాము. పలు చోట్ల మౌలిక సదుపాయాల కల్పన ప్రారంభించాము. శనివారం ఆమంచర్ల, భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాల్లో పార్క్‌లకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఎంఎస్ఎంఈ పార్కులతో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాము.

- ఎల్ శివకుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం

నగరంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్


నెల్లూరు నగర నియోజకవర్గానికి సంబంధించి వెంకటేశ్వరపురం పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో 2.4 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంఎస్ఎంఈ పార్క్ కోసం ఏపీఐఐసీకి అప్పగించారు. అయితే ఈ భూమిలో ప్లాట్లకు బదులు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)ని జీ+2గా నిర్మించనున్నారు. ఇక్కడి దుకాణాలను యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించనున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, కాంప్లెక్స్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు శనివారం సాయంత్రం రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ శంకుస్థాపన చేయన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి : కలెక్టర్

నెల్లూరు (జడ్పీ), మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణా లను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గృహనిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన చాం బర్‌లో ఎన్టీఆర్ హౌసింగ్ పురోగతిపై సమీక్ష జరిపారు. ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆప్షన్-3 కింద లబ్ధిదారుల కోసం కాంట్రా క్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను ఇంజనీరింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిం చాలని సూచించారు. నల్లరేగడి నేలల్లో నిర్మిస్తున్న ఇళ్ల పునాదుల నాణ్య తను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తనిఖీ చేసి సర్టిఫై చేయా లన్నారు. నాణ్యత ప్రమాణాలు లేని ఇళ్లను ముందుగానే గుర్తించి, పునాదులను పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పీఎంఏవై - ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నూతన ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల ఎస్ఈలు గంగాధర్, వెంకట రమణ, విజయన్, అశోక్‌కుమార్, డీఈలు జహీరుద్దీన్, నారాయణరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

డెల్టాకు 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల

అనంతసాగరం మే 9 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి శుక్రవారం 4వేల క్యూసెక్కుల నీటిని పెన్నా డెల్టాకు విడుదల చేశారు. డ్యాంలోని 6వ క్రస్ట్‌గేట్ నుంచి 2,800, పవర్‌ప్లాంట్ కెనాల్ నుంచి 1,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 50.425 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు ఇస్తున్నట్లు వివరించారు.



వంటిల్లు

మనలో చాలామంది తాటి ముంజలను ఇష్టంగా తింటూ ఉంటారు. వీటితో రకరకాల వంటలు కూడా చేసుకోవచ్చు. తాటి ముంజలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

తాటి ముంజలతో మురిపించే రుచులు



తాటి ముంజలతో లెమనేడ్

కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, నిమ్మరసం- రెండు చెంచాలు, పంచదార- మూడు చెంచాలు, ఐస్ క్యూబ్స్- 4, ఉప్పు- చిటికెడు, నల్ల ఉప్పు- చిటికెడు, నీళ్లలో నానబెట్టిన సబ్జాగింజలు- రెండు చెంచాలు, పుదీనా ఆకులు రెండు

జాగ్రత్తలు

- లేత తాటి ముంజలు తీసుకుంటే ఈ పానీయం మరింత రుచిగా ఉంటుంది.
- ఇందులో నానబెట్టిన చియా గింజలు కూడా వేసుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలను చిన్న ముక్కలుగా తరగాలి.
- మిక్సీలో తాటి ముంజల ముక్కల్లో సగం, నిమ్మరసం, పంచదార, రెండు ఐస్ క్యూబ్‌లు, ఉప్పు, నల్ల ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి.
- ఒక సర్వింగ్ గ్లాస్‌లో సబ్జా గింజలు, మిగిలిన తాటి ముంజల ముక్కలు, రెండు ఐస్ క్యూబ్‌లు, మిక్సీ గిన్నెలోని మిశ్రమం వేయాలి. ఒక గ్లాసు చల్లని నీళ్లు పోయాలి. పైన పుదీనా ఆకులు వేసి సర్వ్ చేయాలి.

వీటిలో నీరు అధికంగా ఉంటుంది కాబట్టి శరీరానికి తగినంత తేమ అందుతుంది. నిర్జలీకరణ సమస్యలు రావు. తాటి ముంజలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



తాటి ముంజల పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, పంచదార- ముప్పావు కప్పు, లేత తాటి ముంజలు- ఆరు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- రెండు చెంచాలు, జీడిపప్పు పలుకులు- రెండు చెంచాలు, గులాబీ నీరు- ఒక చెంచా

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి వీలైనంత సన్నగా తరగాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి పెద్ద మంట మీద పావుగంటసేపు మరిగించాలి. పాలను గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా అయ్యాక పంచదార పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పాలను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచాలి. తరవాత ఈ చల్లటి పాలలో తాటి ముంజల తరుగు, గులాబీ నీళ్లు, బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. తరవాత చిన్న పింగాణీ గిన్నెల్లో పోసి సర్వ్ చేయడమే. ఈ పాయసం రుచి అద్భుతంగా ఉంటుంది.



జాగ్రత్తలు

- పాయసం చిక్కగా ఉండాలనుకుంటే... చిన్న గిన్నెలో ఒక చెంచా కస్టర్డ్ పౌడర్ వేసి, కొన్ని నీళ్లు పోయాలి. జారుగా కలిపి ఆ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో కలిపితే సరిపోతుంది.
- గులాబీ నీరు అందుబాటులో లేకపోతే నాలుగు రేకుల కుంకుమ పువ్వు వేసుకోవచ్చు.
- పంచదార వద్దనుకుంటే... మరిగిన పాలను స్టవ్ మీద నుంచి దించాక అందులో బెల్లం పొడి కలుపుకోవచ్చు.

తాటి ముంజలలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటు, మలబద్ధకం లాంటి సమస్యలను నివారిస్తాయి. శరీరంలో కణితులు, రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ముఖం మీద మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా చేస్తాయి.

తాటి ముంజల కూర



కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, జీలకర్ర- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- పావు కప్పు, నూనె- మూడు చెంచాలు

జాగ్రత్తలు

- తాటి ముంజల్ని మరీ లేతగా, మరీ ముదురుగా కాకుండా మధ్యస్థంగా ఉండేవి తీసుకోవాలి.
- నూనె వేడెక్కిన వెంటనే కొన్ని జీడిపప్పు పలుకులు వేస్తే కూర కమ్మగా ఉంటుంది.
- టమాటా ముక్కలను వీలైనంత సన్నగా తరగాలి. లేదంటే టమాటా పేస్టు వాడుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి ఒక్కోదాన్ని నాలుగు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద కడాయి పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. తరవాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత తాటి ముంజల ముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత టమాటా ముక్కలు, ధనియాలపొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కడాయిని స్టవ్ మీద నుంచి దించి కూరను వేరే గిన్నెలోకి తీయాలి. ఈ తాటి ముంజల కూర... అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

ఎండాకాలంలో తాటి ముంజలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. వడదెబ్బ తగలదు. శరీరంలో పేరుకున్న విషపదార్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

భోజన కుతూహలం

పల్లేరుతో భేషైన ఆరోగ్యం..!

పల్లేరు మనకు చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది. చాలా మంది దీన్ని పిచ్చి మొక్క అనుకుంటారు. కానీ పల్లేరు కాయలు, ఆకుల వల్ల అమితమైన ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి.



పల్లేరును సంస్కృతంలో 'గోక్షురం' అని పిలుస్తారు. 'గోక్షురం' అంటే శరీరానికి చల్లదనాన్ని, బలాన్ని, పుష్టిని అందించేదని అర్థం. పల్లేరుకాయలు చిన్నవి, పెద్దవి అని రెండు రకాలుగా ఉంటాయి. పెద్ద పల్లేరుకాయల్ని 'గజపల్లేరు' అంటారు. ఈ కాయను రెండుగా చీలిస్తే- లోపల భాగమంతా జిగురుగా ఉంటుంది. ఈ జిగురు మన శరీరానికి ఎంతో ఉపకరిస్తుంది. కేవలం జిగురు మాత్రమే కాదు, పల్లేరు ఆకులు, కాయలు, వేర్లు... ఇవన్నీ త్రిదోష సమతుల్యతను కలిగిస్తాయి. చిన్న పల్లేరు కాయలకు కూడా ఈ తరహా గుణాలే ఉంటాయి. పల్లేరు కాయలు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

- పల్లేరు ఆకులను ఎండబెట్టి వాటితో ఉదయాన్నే టీ చేసుకొని తాగితే చర్మానికి కాంతి వస్తుంది.
- పల్లేరు ఆకులను సలాడ్‌లో వేసుకొని తింటే మూత్రంలో మంట తగ్గుతుంది. మూత్రనాళంలోని రాళ్లు కరిగిపోతాయి.
- పల్లేరు కాయలను ఎండబెట్టి కషాయంగా చేసి తాగితే హార్మోన్ల అసమతౌల్యం కలిగే రకరకాల సమస్యలు తగ్గుతాయి. యువతులను వేధించే 'పోలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్' (పీసీఓడీ)కు కూడా ఇది మంచి పరిష్కారం.
- పల్లేరు కాయలు స్ఫటికం మాదిరిగా ముళ్లు ముళ్లుగా ఉంటాయి. ఈ కాయలలోని గుజ్జును ఏదో ఒక రూపంలో తీసుకుంటే మూత్రపిండాల్లో పేరుకున్న రాళ్లు కరుగుతాయి.
- పల్లేరు ఆకులు, కాయలు, వేర్లను ఎండబెట్టి... పొడి చేసి దాన్ని కూరల్లో వాడుకుంటే రకరకాల ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

మూతల రంగుల్లో మర్మం ఇదే..!



మనం సాధారణంగా బయటికి వెళ్లినప్పుడు లేదా ప్రయాణాల్లో దాహమనిపిస్తే వెంటనే వాటర్ బాటిల్ కొనుక్కుని నీళ్లు తాగేస్తూ ఉంటాం. ఈ బాటిళ్లకు పలు రంగుల మూతలు ఉండడాన్ని చాలామంది గమనించే ఉంటారు. ఈ రంగు మూతలు ఆ బాటిళ్లలోని నీటి గురించి తెలియజేస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

నీలం: మనకు తరచుగా లభ్యమయ్యే వాటర్ బాటిళ్లకు నీలం రంగు మూతలు ఉంటాయి. అంటే ఆ బాటిళ్లలోని నీటిని నదులు, చెరువులు లాంటి సహజ వనరుల నుంచి సేకరించి శుద్ధి చేశారని అర్థం. ఈ నీటిలో లవణాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే ఈ నీటిని 'మినరల్ వాటర్' అంటారు.

ఆకుపచ్చ: ఇవి కాస్త అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. పెద్ద సూపర్ మార్కెట్లలో, షాపింగ్ మాల్స్‌లో, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఇవి లభ్యమవుతాయి. ఆకుపచ్చ మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నది 'ఫ్లేవర్డ్ వాటర్' అని అర్థం. కొన్ని రకాల నేచురల్ ఫ్లేవర్స్‌ను స్వల్ప మోతాదులో కలపడం వల్ల ఈ నీరు ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.



నలుపు: నలుపు రంగు మూత ఉన్న వాటర్ బాటిల్స్ కూడా అరుదుగానే కనిపిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. వీటిని సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు కొంటూ ఉంటారు. నల్లని మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి... 'ఆల్కలైన్ కలిపిన నీళ్లు' అని అర్థం. ఈ నీళ్లు తాగితే కడుపులో ఆమ్లత్వం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్షార పదార్థాలు, మినరల్స్ కూడా కలుపుతారు.

తెలుపు: తెల్లని మూత ఉన్న వాటర్ బాటిల్స్ సాధారణంగా అన్ని చోట్లా దొరుకుతూనే ఉంటాయి. వీధి చివరన ఉండే చిన్న కొట్లు, కిరాణా షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, బస్టాండ్లలో ఇవి విరివిగా లభ్యమవుతూ ఉంటాయి. తెలుపు మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి 'బాగా శుద్ధి చేసిన నీళ్లు' అని అర్థం. వీటిలో ఎటువంటి మినరల్స్ ఉండవు. కేవలం దాహం తీర్చుకోవడానికి పనికొస్తాయి.

పసుపు, ఎరుపు, గులాబీ రంగులు: పసుపు రంగు మూత ఉంటే ఆ నీళ్లు విటమిన్లు, ఎలక్ట్రొలైట్లు కలిపినవనీ; ఎరుపు రంగు మూత ఉంటే అవి కార్బొనేటెడ్ నీళ్లు అనీ తెలుసుకోవచ్చు. గులాబీ రంగు మూత ఉంటే అది నీటిని గురించి తెలియజేసేది కాదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినది.

మేకప్

మదర్స్ డే మేకప్

మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేకప్‌తో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిని గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజితోనే అద్దుకోవాలి.



తులసి ప్రయోజనాలెన్నో!

తులసి మొక్కను మనం పవిత్రంగా భావిస్తాం. దానిని అనునిత్యం పూజిస్తాం. అలాంటి తులసిలో విటమిన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు తాంటివి పుష్కలంగా



ఉంటాయి. అందుకే తులసి ఆకులను తినడం, తులసి కషాయం, తులసి టీ తాగడం... ఇలా ఏదో ఒక రూపంలో తులసిని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం.

- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- తులసి కషాయం తాగడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

సెలబ్ ఫిట్

నవయవ్వన సోయగం

తారాజువ్వలా వెండితెర మీదకు దూసుకువచ్చింది. సల్మాన్ లాంటి స్టార్ల సరసన అందంగా ఒదిగిపోయింది. నవయవ్వన కాంతితో యువతరం హృదయ స్పందనై వెలిగింది. పరిశ్రమలోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా... నేటికీ అదే మైమరిపించే రూపు... చూపు తిప్పుకోనివ్వని నాజూకు... జాక్వెలిన్ ఫెర్నాండెజ్.



స్వదేశం శ్రీలంక. పుట్టింది బహ్రైన్‌లో. డిగ్రీ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో. ఆమె తండ్రి ఎల్రాయ్ ఫెర్నాండెజ్‌ది శ్రీలంక. తల్లి కిమ్‌ది మలేషియా, కెనడా మూలాలున్న కుటుంబం. శ్రీలంకలో సింహళీస్, తమిళుల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో జాక్వెలిన్ తండ్రి దేశం వదిలి బహ్రైన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తున్న కిమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన జాక్వెలిన్‌కు అక్క, ఇద్దరు అన్నలు. సిడ్నీ వర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన ఆమె... కొంత కాలం టీవీ రిపోర్టర్‌గా పని చేసింది. గ్లామర్ ప్రపంచంలోకి రావాలన్న ఆసక్తితో మోడలింగ్ మొదలుపెట్టింది. 2006లో 'మిస్ యూనివర్స్ శ్రీలంక' కిరీటాన్ని దక్కించుకుని, తన దేశం నుంచి 'మిస్ యూనివర్స్'కు పోటీపడింది.

అలా వచ్చి...

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది జాక్వెలిన్.

ఆదివారమూ విరామం లేదు...

ఇతర తారలకు భిన్నంగా... జాక్వెలిన్ రోజూ కంటే ఆదివారం వ్యాయామాల కోసం మరింత ఎక్కువ సమయం కేటాయిస్తుందిట. "యోగా, వెయిట్ ట్రైనింగ్, డ్యాన్స్‌లు కలగలిపి ఆదివారం నా వర్కవుట్ రెండు నుంచి మూడు గంటలపాటు తీవ్రంగా సాగుతుంది. కొంతమంది అంటుంటారు... 'నాక్కూడా నీలాంటి దృఢమైన ఆకృతి కావాల'ని. ఇది ఒక్క రోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా ఇదే రూపాన్ని కాపాడుకొంటూ వస్తున్నా. క్రమం తప్పని ఆహార నియమాలు పాటిస్తున్నా. నా రూపు అథ్లెట్లను తలపించాలని కోరుకొంటాను. ఎప్పుడూ దృఢంగా, ఉల్లాసంగా, చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తాను. అవసరమైనప్పుడు కావల్సినంత విశ్రాంతి తీసుకొంటాను" అంటున్న ఈ ముద్దుగుమ్మ తరచూ తన ఫిట్‌నెస్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, అభిమానులకు ప్రేరణ కలిగిస్తుంటుంది. ఇన్‌స్టాలో ఏడు కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారంటే ఆమె క్రేజ్ ఏస్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

- జాక్వెలిన్ వ్యాయామాల్లో ప్రధానంగా యోగ ఉంటుంది.
- ఉదయం లేవగానే జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో తరువాత యోగా, పిలెట్స్, స్ట్రెంత్ ట్రైనింగ్
- రోజూ ఒకటే రకం వర్కవుట్స్‌తో ఆసక్తి తగ్గుతుంది. అందుకని తనను తాను ఉత్సాహపరుచుకోవడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొంటుంది.
- వ్యాయామాలను ఉత్సాహభరితంగా మార్చేందుకు పోల్‌డ్యాన్స్, ఏరియల్ సిల్క్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. పోల్ డ్యాన్స్ తనలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపిందో, శరీరాన్ని మరింత దృఢంగా ఎలా మార్చిందో వివరిస్తూ ఆ మధ్య ఇన్‌స్టాలో ఒకపోస్టు పెట్టింది జాక్వెలిన్.

- తెల్లవారుజామును ఐదు గంటలకే జాక్వెలిన్ దినచర్య మొదలవుతుంది.
- ఉదయం లేవగానే తేనె, నిమ్మ రసం కలిపిన గ్లాసుడు గోరువెచ్చని నీరు
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, గ్రీన్ టీ.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతో బ్రౌన్ రైస్, వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్‌లు. వీటితోపాటు పిండి, పీచు పదార్థాలు, పోషక విలువలు పుష్కలంగా ఉండే క్వినోవా ఆమె మెనూలో తప్పనిసరి.
- అలాగే సలాడ్‌లు, వంటల్లో రెడ్, యల్లో క్యాప్సికమ్, చిలకడదుంపలు చేరతాయి.
- ఇంటర్మిటెన్ ఫాస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. తీపి పదార్థాలకు దూరంగా ఉంటుంది.
- రాత్రిపూట తేలికపాటి భోజనం. సాధ్యమైనంతవరకు రాత్రి ఏడు గంటలకల్లా డిన్నర్ ముగిస్తుంది.



కాకర చేదు తగ్గాలంటే!

కాకరకాయలో ఎన్నో పోషకగుణాలు ఉన్నాయి. కానీ చేదుగా ఉంటుందని చాలామంది దానితో చేసే వంటలను ఇష్టపడరు. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించి కాకరకాయ చేదును తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- కాకరకాయపైన ఉండే గరుకు భాగాన్ని తొలగించేయాలి. దీని వల్ల సగం చేదు తగ్గుతుంది.
- కాకరకాయ ముక్కలకు ఉప్పు రాసి 20-30 నిమిషాల ఉంచి తరువాత ఆ ముక్కలను నీళ్లతో మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దీని వల్ల చేదు కూడా తగ్గుతుంది.
- వేడి నీటిలో ఉప్పు వేసి అందులో కాకరముక్కలను నానబెట్టినా చేదును తగ్గించవచ్చు.
- కాకరకాయలో విత్తనాలు తీసివేయడం వల్ల కూడా చేదు తగ్గుతుంది.
- కాకర ముక్కలకు పెరుగు రాసి గంటసేపు పక్కన పెడితే చేదు చాలావరకూ తగ్గిపోతుంది.





చల్లగుండాలి!

● రైల్వే గేట్ల వద్ద పందిరి

రైల్వే గేటు వేస్తే మళ్లీ తీసే వరకు అక్కడ పడిగాపులు కాయాల్సిందే. అసలే ఎండా కాలం రోజురోజుకు సూర్యుడు భగ్గుమంటున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో రైల్వే గేటు దగ్గర 10 నిమిషాలు నిలబడటం కూడా కష్టమే. పసి పిల్లలు, ఆడవాళ్లు, వృద్ధుల పరిస్థితి అయితే మరీ ఇబ్బందికరం. వాహన దారుల ఈ అవస్థను అర్థం చేసుకున్న నెల్లూరు నగర పాలక సంస్థ, రైల్వే గేట్ల వద్ద నీడ కోసం పచ్చటి పట్టలతో పందిరి వేస్తోంది. నగరంలోని బీవీనగర్ రైల్వే గేటు వద్ద ఇలాంటి పందిరి ఏర్పాటు చేశారు. దాని కింద నిలబడ్డ వాహనదారులు మండువేసవిలో చల్లటి నీడ కల్పించినం దుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన లెవల్ క్రాసింగ్‌ల వద్ద కూడా ఈ పందిళ్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

మహిళలను వ్యాపారవేత్తలుగా చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (హరనాథపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలను వ్యాపారవేత్త లుగా తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏపీఎం, ఏసీలతో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ తదితర విభాగాల నుంచి ఆర్థిక సహకారం అందించిన మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలని ఆదేశించారు. మహిళా పారిశ్రామికవేత్తల పథ కం కింద జూన్ 8వతేదీలోపు వెయ్యి మంది మహిళలను గుర్తించి వారికి ఉపాధి కల్పించాలని సూచించారు. మొబైల్ బుక్ కీపింగ్‌లో 100 శాతం ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు.

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

● కట్టుదిట్టంగా నిర్వహించాలి : డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్ రావు

నెల్లూరు(విద్య), మే 9 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ సప్లి మెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిం చాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో శనివారం అధికా రులతో సమన్వయ కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈనెల 12 నుంచి 20 వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ప్రాక్టికల్స్ కూడా ఈనెల 28 నుంచి జూన్ 1వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 24,835 మంది విద్యార్థులు హాజరవుతుండగా వీరికోసం 65 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ 0861-2320312 నెంబర్‌ను అందు బాటులో ఉంచామని. సమస్యలుంటే తెలియచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ఐవో వర ప్రసాద్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగు ఇక.. తేలికే!



● కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంలో ముద్రణ

● 1, 2 తరగతులకు ఒకే బుక్‌లో 3 సబ్జెక్టులు

● 9, 10 తరగతులకు మారిన హిందీ సిలబస్

● స్కూళ్ల ప్రారంభానికి ముందే సరఫరా : డీఈవో

మనుబోలు, మే 9 (ఆంధ్రజ్యోతి) : బడిపిల్లలకు పుస్తకాల మోత తగ్గనుంది. స్కూలు బ్యాగు ఇక తేలిక కానుంది. ఆ మేరకు కొత్తదనంతో పాఠ్యపుస్తకాలు వచ్చేశాయి. గత వైసీపీ హయాంలో ఒక పుస్తకాన్ని రెండు, మూడు సెమిస్టర్లుగా విభజించి, భారీగా పుస్తకాలు ముద్రించి పిల్లలపై భారం మోపారు. అయితే కూటమి ప్రభుత్వం పిల్లలపై బ్యాగులు, పుస్తకాల భారం ఉండకూడదని, ఒకే పుస్తకంలో మూడు సబ్జెక్టులు ముద్రించి అదనపు భారాన్ని తగ్గించారు. 1 నుంచి 10వ తరగతి వరకు ఆరు సబ్జెక్టుల పుస్తకాల కంటే ఎక్కువ రావు. గతంలో 14 పుస్తకాలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఈ ఏడాది తక్కువ సైజ్‌లో ఎక్కువ సౌలభ్యంతో కొత్త పాఠ్యపుస్తకాలను అందించనున్నారు.

● 9.56 లక్షల ఇండెంట్

ఉమ్మడి నెల్లూరు జిల్లాకు 9.56 లక్షల సెమిస్టర్-1 పుస్తకాలు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. ఈ మేర 9.29 లక్షల పుస్తకాలను జిల్లాలోని గోదాములకు చేరగా, ఆర్టీసీ బస్సుల ద్వారా వాటిని మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 18 మండలాలకు పుస్తకాలను సరఫరా చేశారు. మండలాల నుంచి ఆయా ఎంఈవోలు స్కూళ్లకు సరఫరా చేయనున్నారు.

● కుదింపు ఇలా..

ప్రభుత్వ బడిపిల్లల పాఠ్యపుస్తకాల బరువుతగ్గాయి. ఒకవిధంగా ఇది పిల్లలకు, తల్లిదండ్రులకు శుభవార్తే. రెండు, మూడు సబ్జెక్టులను ఒకే పుస్తకంలో ఉండేలా ముద్రించారు. గతంలో కొన్ని తరగతులకు 10నుంచి 14 పుస్తకాల వరకు అందించారు. దీంతో ఆ పుస్తకాలను మోయలేక విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఈ ఏడాది కొత్తగా వచ్చిన పాఠ్యపుస్తకాలలో చాలా క్లాసులకు రెండు, మూడు సబ్జెక్టులకు ఒక పుస్తకంగానూ, ఒక సబ్జెక్టుకు ఒకే పుస్తకం తీసుకురావడంతో ఆ బరువు తగ్గనుంది. 9, 10తరగతులలో హిందీ పుస్తకాల సిలబస్ మారనున్నాయి. 1, 2 తరగతులకు తెలుగు, గణితం, ఇంగ్లీషు (ఒక పుస్తకంగా), 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు ఒక పుస్తకంగా, గణితం, ఈవీఎస్ ఒక పుస్తకంగా, 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు ఒక పుస్తకంగా, సోషల్, గణితం, సైన్స్ విడివిడిగా, 8,9 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు ఒకటిగా, ఫిజిక్స్ బయాలజీ ఒకటిగా, సోషల్, గణితం విడివిడిగా పుస్తకాలు ఉంటాయి. 10వ తరగతికి మాత్రం అన్ని సబ్జెక్టులు, వర్క్‌బుక్స్ కలిపి సుమారు 12 పుస్తకాలు అందనున్నాయి.

18 మండలాలకు పంపిణీ చేశాం



కొత్త పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం వేగంగా సరఫరా చేస్తోంది. ఉమ్మడి జిల్లా కోసం 9.29 లక్షల పుస్తకాలు చేరాయి. కేవలం 26వేల పుస్తకాలు మాత్రమే అందాల్సి ఉంది. పుస్తకాలతోపాటు ఇతర స్టూడెంట్స్ కిట్స్ వస్తున్నాయి. 18మండలాలకు 90శాతం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశాం. విద్యా సంవత్సరం ప్రారంభానికంటే ముందుగానే అన్ని మండలాలకు కిట్లు, పుస్తకాలు విద్యార్థులకు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

- రాజా బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి



మనుబోలుకు చేరిన పాఠ్యపుస్తకాలు



ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

విద్యారంగ పరిస్థితులు ఆందోళనకరం

● కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ నిరసన

నెల్లూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ప్రస్తుతం పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, పాత ప్రభుత్వ విధానాలతో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారాయని ఏపీటీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వారు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎం దశరథ రాములు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగిస్తేనే విద్యార్థికి సరైన సామర్థ్యాలు పెరుగుతాయని చెప్పారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు టీచర్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియంను కొనసాగించాలన్నారు. ప్రభుత్వం వీటిపై దృష్టి సారించకుండా ప్రాథమిక పాఠశాలలను తొలగించే ప్రయత్నం చేయడం సరికాదని చెప్పారు. జిల్లా కార్యదర్శి కే హజరత్ మాట్లాడుతూ నూతనంగా ఉన్నతీకరించిన ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా హెచ్ఎం, పీడీ పోస్టులు కేటాయించాలని కోరారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌నే కొనసాగించాలన్నారు. మెమో నెం 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు కే సురేఖ, ఏ రఘునందనరెడ్డి, కార్యదర్శులు ఆర్ శరత్‌బాబు, ఎన్ జనార్ధన్‌రెడ్డి, ఓ శ్రీనివాసరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లూరు... సారా రహితం

● ప్రకటించిన కలెక్టర్ ఆనంద్



సారారహిత జిల్లాగా ప్రకటిస్తూ సంతకం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరును సారా రహిత జిల్లాగా కలెక్టర్ ఓ ఆనంద్ ప్రకటించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్లో ఆయన సమీక్ష జరిపారు. నాటుసారా నిర్మూలనకు చేపట్టిన చర్యలను ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు వివరిం చారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో నాటుసారా నిర్మూలనకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టారని అభినందించారు. కావలి, బుచ్చిరెడ్డిపాలెం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని రెండు మండలాల్లో ఐదు గ్రామాలను నాటుసారా గ్రామాలుగా గుర్తించి గత మూడు నెలలుగా రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీశాఖల సమన్వయంతో ఎక్సైజ్ అధికారులు సారా నివారణకు చర్యలు చేపట్టారన్నారు. ఐదు గ్రామాలను విడతల వారీగా నాటుసారా రహితంగా, రెండు మండలాలను సారారహిత మండలాలుగా గ్రామ, మండల స్థాయిలో తీర్మానించినట్లు తెలిపారు. జిల్లాలో నాటుసారాపై ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి నెల్లూరు జిల్లాను నాటుసారా రహితంగా ప్రకటిస్తున్నామని చెప్పారు. ఇక నుంచి జిల్లాలో ఎక్కడ నాటుసారా తయారీ, సరఫరా, అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకొని పటిష్ట నిఘా కొనసాగించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎక్సైజ్ డీసీ టీ శ్రీనివాసరావు, ఏసీ దయాసాగర్, ఈఎస్ శ్రీనివాసులునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

భంగ్, గంజాయి మిక్సింగ్

● గోలీల రూపంలో విక్రయం

● టీ దుకాణంలో పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది

నెల్లూరు(క్రైం), మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నెల్లూరులోని ఓ టీ దుకాణంలో గంజాయి కలిపిన భంగ్ గోలీల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను శుక్రవారం ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో ఏసీ దయాసాగర్ విలేకర్లకు వెల్లడించారు. నగరంలోని బృందావనం ఇందిరా భవన్ సమీపంలో లక్ష్మీ టీ స్టాల్ నిర్వహిస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జయకిషన్ మత్తు కలిగించే భంగ్ గోలీలు విక్రయిస్తున్నట్లు తెలిసి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 640 భంగ్ గోలీల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 384 గ్రాముల గంజాయి కలిసి ఉన్నట్లు గుర్తించారు. జయకిషన్‌ను విచారించగా రాజస్థాన్‌లో ఈ ప్యాకెట్లు కొనుగోలు చేసి నెల్లూరులో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరిం చాడు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు వై వెంకటేశ్వర్లు, పీ అనిత, ఎస్ఐ సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు ఏ రమేష్‌కుమార్, ఎం కిరణ్‌సింగ్ పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ దయాసాగర్

పాక్‌పై ప్రతీకార చర్యలకు సిద్ధం

● ఉగ్రదాడిలో భర్తలను కోల్పోయిన మహిళల కోసమే 'ఆపరేషన్ సిందూర్'

● కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ

● కావలిలో మధుసూదన్‌రావు కుటుంబానికి పరామర్శ

● తన తండ్రి ట్రస్టు ద్వారా రూ.5లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటన

కావలి/నెల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దులో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యలకు భారత్ సిద్ధమవుతోందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కావలివాసి మధుసూదనరావు కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి శుక్రవారం పరామర్శించారు. మధుసూదనరావు భార్య ప్రసన్న కామాక్షి ప్రసన్నతో మాట్లాడి, ఆమెకు అన్నివిధాలా కేంద్రం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో శ్రీనివాసవర్మ మాట్లాడుతూ భర్తలను కోల్పోయిన మహిళల ఆత్మశాంతి కోసమే ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేయించారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను ప్రేరేపించేందుకు పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేశారన్నారు. పర్యాటకులలో అభద్రతా భావం సృష్టించి పర్యాటకాన్ని దెబ్బ తీయడానికి ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పోషిస్తోందన్నారు. ప్రపంచదేశాల్లో 5వ ఆర్థికశక్తిగా భారత్ ఎదుగుతుండటంతో దీనిని ఓర్వలేని కొన్ని దేశాలు తెరవెనుక పాక్‌కు సహకరిస్తున్నాయని విమర్శించారు. పాక్‌ను చిత్తు చేయడం, దానిని అంతం చేయడం భారత్‌కు పెద్ద పని కాదని, అయితే యుద్ధాలు కాకుండా శాంతియుతమనే భావంతో భారత్ ఉందన్నారు. మధుసూదనరావు కుమార్తె చదువు బాధ్యత బీజేపీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. తన తండ్రి సూర్యనారాయణ రాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు దయాకర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, సత్యనారాయణ, భరత్‌కుమార్, కమల, సీపీసీ సత్యం, అమరా వెంకటసుబ్బారావు, బ్రహ్మానందం, మందా కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నెల్లూరులోని బీజేపీ రాష్ట్ర మోర్చాల ఇన్చార్జి పీ సురేంద్రరెడ్డి నివాసానికి కేంద్రసహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ దంపతులు విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియాతో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ పాకిస్థాన్ కవ్వింపు చర్యలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏ మాత్రం అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కే ఆంజనేయరెడ్డి, సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ప్రసన్న కామాక్షితో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

వైద్య విద్యను చాలెంజ్‌గా తీసుకోండి!

● ర్యాగింగ్‌కు పాల్పడవద్దు ● ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గోవింద్

● ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే!



జ్యోతి వెలిగించి ఫ్రెషర్స్‌డేను ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), మే 9 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యను ఒక చాలెంజ్‌గా తీసుకుని పూర్తి చేయాలని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గోవింద్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ 2024 బ్యాచ్ వైద్య విద్యార్థులు వైద్య కళాశాలకు మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలన్నారు. హాజరు తప్పని సరిగా ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ నరేంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా వైద్యవిద్యను పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంచిపెట్టారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

వెంకటాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి): గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలోని ఆర్టీసీ జోనల్ కళాశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడి నలుగురు గాయపడ్డారు. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటో మలుపు వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా..ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే ఆటో ముందు భాగం కూడా దెబ్బతింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



అదుపుతప్పి బోల్తాపడిన ఆటో

ఆదిలోనే కష్టాలు

కొత్త రేషన్‌కార్డులకు సర్వర్ సమస్య

నెల్లూరు (హరనాథపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ జిల్లాలో కష్టతరంగా మారింది. సచివాలయాల ద్వారా కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో ఎంతోమంది సచివాలయాలకు వస్తున్నారు. అయితే అక్కడ సర్వర్ మొరాయిస్తుండటంతో గంటల తరబడి వేచి ఉండి ఉసూ రుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. జిల్లాలో 7.38లక్షల కార్డులున్నాయి. రేషన్‌కార్డులు లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డులు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడానికి ప్రక్రియ ప్రారంభించడంతో ఆనందించారు. బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైనా సర్వర్ మొరాయిస్తుండటంతో ఆశావహులు నిరుత్సాహపడుతున్నారు.

గ్రావెల్ అక్రమ రవాణాలో అధికారుల హస్తం

● సోషల్ మీడియాలో రికార్డింగ్ వాయిస్ హల్‌చల్



అక్రమ తవ్వకాలతో ఏర్పడ్డ గోతులు

అనంతసాగరం మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలపల్లి వద్ద ప్రభుత్వ భూమి నుంచి గ్రావెల్ అక్రమ రవాణా యధేచ్ఛగా జరుగుతోంది. రాత్రివేళల్లో ఎక్సకవేటర్లు పెట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లతో గ్రావెల్ తర లిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇందులో అధికారుల అవినీతి వాటా గురించి ఇద్దరు వ్యక్తులు సంభా షించుకున్న రికార్డింగ్ వాయిస్ సోషల్ మీడియాలో గురువారం రాత్రి నుంచి హల్‌చల్ చేస్తుం డడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతు న్నాయి. ఇందులో మండల రెవెన్యూ అధికారి వాటా, పోలీసులకు ఇచ్చే మాముళ్ల గురించి చర్చ జరిగింది. కాగా, అధికారుల అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

చాపకింద నీరులా ఎర్ర దుంగల రవాణా

● కొరవడిన నిఘా

అనంతసాగరం మే 9 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిఘా కొరవడడంతో సోమశిల, మర్రిపాడు, అనంతసాగరం ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణా చాపకింద నీరులా సాగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సోమశిల జలాశయం వెనుక ఎర్రచందనం అక్రమ రవాణా యధేచ్ఛగా జరిగేది. నిఘా అధికారులు కట్టడి చేసేవారు. నేడు ఆ పరిస్థితి లేకపోవడంతో డ్యాం లోతట్టున ఎర్రచందనం డంప్‌లు నీటి అడుగున దాచి స్మగ్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తుండగా ఆదిశగా దాడులు జరగడం లేదు. ఇక సోమశిల డ్యాం వద్ద ఏర్పాటు చేసిన అటవీశాఖ చెక్‌పోస్టు పేరుకే అన్నచందంగా ఉంది. వాహన రాకపోకలు అధికంగా ఉన్నా తనిఖీ కొరవడింది. దీంతో గోప్యంగా ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో మర్రిపాడు మండలంలో పలు మార్లు దుంగలు పట్టుపడగా రెండు రోజుల వ్యవధిలో అనంతసాగరం పరిధిలోని గుడిగుంట బీట్ వద్ద చెట్లలో దాచిన 11దుంగలు సిబ్బంది కనుగొన్నారు. మర్రిపాడు, అనంత సాగరం, రాపూరు ప్రాంతాల గుండా జాతీయరహదారి 565 ఉండడంతో స్మగ్లర్ల కార్యకలాపాలు సులభతరం అయ్యాయని, ఇప్పటికైనా జిల్లాలో నిఘా వ్యవస్థలు అప్రమత్తమై ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుడిగుంట వద్ద చెట్లలో దాచిన ఎర్రదుంగలు (ఫైల్‌ఫోటో)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100) : 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9285
వెండి కిలో ధర	రూ. 98,700
వెండి ఒక గ్రాము	రూ.101.70

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోండి : డీఎస్పీ రామారావ్

నెల్లూరు (వైద్యం), మే 9 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు సూచించారు. శుక్రవారం నారాయణ వైద్య కళాశాలలో మహిళా రక్షణపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ శక్తి యాప్ డౌన్‌లోడ్, వినియోగం, ఉపయోగాన్ని వివరించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, సీఐ కృష్ణారెడ్డి, రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, నారాయణ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇళ్ల పట్టాలు

● మాట ఇచ్చాను.. నిలబెట్టుకొన్నాను ● మంత్రి నారాయణ ● భగత్‌సింగ్ కాలనీలో బ్రహ్మరథం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న పట్టాల సమస్యను పరిష్కరించి ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నానని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన భగత్‌సింగ్ కాలనీలో పర్యటించారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం పొందినందుకు మంత్రి నారాయణకు కాలనీ ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, హారతులతో అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మంత్రి నారాయణ ప్రతీ ఇంటికి వెళ్లి పట్టాలు మంజూరు చేస్తున్న శుభవార్తను తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాట ఇచ్చాను.. నిలబెట్టుకొన్నానన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతీ ఒక్కరికీ పట్టాలను అందచేస్తామని ప్రకటించారు. పేద కుటుంబంలో పుట్టిన తనకు చదువుతోపాటు సంస్కారాన్ని తన తల్లితండ్రులు నేర్పించారన్నారు. పేదల కష్టాలు, అవసరాలు తెలుసుకనుకనే శాశ్వత పట్టాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి, జహీర్, జమీర్, సఫియాముజీర్, నాయకులు మునీర్, ముజీర్, జంషీద్, అన్వర్ పాల్గొన్నారు.



నారాయణకు గుమ్మడికాయ దిష్టి తీస్తున్న మహిళ

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంపై ఆగ్రహం

నెల్లూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పన్ను వసూళ్లలో ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు కార్పొరేషన్ యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎంసీ కార్యాలయంలో శుక్రవారం పలు విభాగాల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. పన్ను వసూళ్లలో ఆశించిన ప్రగతి లేదని రెవెన్యూ విభాగంపై మండిపడ్డారు. గడిచిన ఐదేళ్లగా బకాయిదారుల ట్రాక్ రికార్డులను పరిశీలించి నివేదిక తయారు చేయాలన్నారు. భవనాలకు సంబంధించి ప్లాన్ అనుమతులను ప్రభుత్వ డాష్‌బోర్డులో ఉంచాలని సూచించారు. కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేస్తున్న నిధులు, వస్తున్న ఆదాయంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతకు ముందు మంత్రి క్యాంపు కార్యాలయంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్‌తో కలిసి అధికారులు, పార్టీ శ్రేణులతో నారాయణ సమావేశం నిర్వహించారు. 22 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ నెల 18న నైపుణ్య అభివృద్ధి మేళా నిర్వహిస్తున్నామని, పది ఐటీ కంపెనీల వరకు అందులో పాల్గొంటాయని పేర్కొన్నారు.

సరస్వతీ నిలయంగా వీఆర్ హైస్కూల్

నెల్లూరు(విద్య) : పేద విద్యార్థులకు సరస్వతీ నిలయంగా వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ తెలిపారు. వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనులను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి వెయ్యిమంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేలా సిద్ధం చేస్తామని చెప్పారు.

న్యూస్ బాక్స్



సింహంపై నరసింహుడు

నెల్లూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేతంగా స్వామివారికి సింహ వాహన సేవ నేత్రపర్వంగా సాగింది. అంతకు ముందు చప్పర ఉత్సవం, తిరుమంజనం, విశేష పూజలు జరిగాయి. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి పాల్గొన్నారు.

మహిళపై కొడవలితో దాడి

నెల్లూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : తన బావతో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కోపంతో బావమరిది ఓ మహిళపై కొడవలితో దాడి చేశాడు. రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు... నెల్లూరులోని ధనలక్ష్మీపురం కేజీకే కల్యాణ మండపం ఎదుట చెట్ల కింద శేషమ్మ అనే మహిళ చిరు వ్యాపారిగా జీవనం సాగిస్తోంది. ఆమె టీపీగూడూరు ప్రాంతానికి చెందిన కరుణాకరణ్‌తో కొంత కాలంగా సహజీవనం చేస్తోంది. ఈ విషయం తెలుసుకున్న కరుణాకరణ్ బావమరిది శ్రీనివాసులు ఆగ్రహంతో శేషమ్మపై కొడవలితో దాడికి పాల్పడ్డాడు. గాయపడ్డ ఆమె స్థానికుల ద్వారా ఆసుపత్రికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇలాగైతే ఎలా...?

ఏందండీ ఇది...? ఇలాగైతే ఎలా...? రోడ్లపై చెత్త కనపడకూడదన్నానుగా.. ఇదేంటంటూ అధికారులను కమిషనర్ వైవో నందన్ ప్రశ్నించారు. శుక్రవారం పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా 8వ డివిజన్ సీఆర్పీ డొంక, తడికల బజార్, శ్రీరంగరాజపురం, రేబాలవారివీధి, ఉస్మాన్‌సాహెబ్‌పేట, అరుంధతీపాళెం, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రోడ్లపై చెత్త కనపడటంతో శానిటేషన్ అధికారులపై మండిపడ్డారు.

\- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి):తాటిపర్తిపాలెం రైల్వేగేటు సమీపంలోని కృష్ణపట్నం పోర్టురోడ్డుపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు రూరల్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు ప్రాంతానికి చెందిన మోహన్ ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఉన్న కంపెనీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా తాటిపర్తిపాళెం రైల్వే గేటు సమీపంలో పోర్టు రోడ్డు పక్కన నిల్చుకుని ఉన్న లారీ ఒక్కసారి కదలడంతో బైక్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన మోహన్‌ను సర్వేపల్లిలోని ప్రైవేటు క్లినిక్‌కు తరలించి చికిత్స అందజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమతి లేని బ్యానర్లకు అపరాధ రుసుం

బుచ్చిరెడ్డిపాళెం, మే9(ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా నగర పంచాయతీ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకూడదని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

జంగాలపల్లిలో స్వచ్ఛభారత్

వెంకటాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి):ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లిలోని గిరిజనకాలనీలో శుక్రవారం జనసేన సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లమధ్యలో పేరుకపోయిన చెత్తను శుభ్రం చేయించి చెత్తకుండీలను ఏర్పాటు చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, పినిశెట్టి మల్లికార్జున్, చెంచయ్య, మణి, చిరంజీవి ఉన్నారు.

సేవలు అభినందనీయం

● బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణిలకు శుక్రవారం మహాయాగ ఫౌండేషన్ పేరుతో స్థానిక దొడ్ల కోదండరామిరెడ్డి టానిక్‌లు, చిక్కీలు, గుడ్లు, పండ్లతోపాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్యాధికారి పద్మజ, కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడికి మధుకైటభ వధ అలంకారం



నెల్లూరు (సాంస్కృతికం), మే 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి వసంతోత్సవాల్లో శుక్రవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం మధుకైటభ వధ అలంకారంలో స్వామివారి తోటలో విశేష పూజలు, ప్రాకారోత్సవం జరిగాయి. ఉభయకర్తలుగా కమపర్తి వెంకట సుబ్రహ్మణ్యం కుటుంబం వ్యవహరించింది. శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు జరుగుతాయని ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసరెడ్డి తెలిపారు.

చంద్రప్రభలో కాశీవిశ్వనాథుడు

నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా ఇడుముకంటి కృష్ణారెడ్డి, రామలక్ష్మీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

భారత సైనికుడు మురళీకృష్ణ నాయక్‌కు నివాళి

నెల్లూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఆర్మీ సైనికుడు మురళీ కృష్ణ నాయక్‌కు ఏపీ జేఏసీ, బీజేవైఎం నేతలు నివాళులర్పించారు. నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించా రు. పాకిస్థాన్ జరిపిన దాడుల్లో కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్ర మంలో ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి ఆదిత్యసాయి, సాంబశివారెడ్డి, పవన్, మౌనష్, జనార్దన్, హరి పాల్గొన్నారు.

స్వర్ణలింగేశ్వరాలయంలో రుద్రపారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), మే 9 (ఆంధ్రజ్యోతి) : పాక్, భారత్ యుద్ధ నేపథ్యం లో భరతవంశం, దేశ సంరక్షణ, శత్రువినాశనం కోసం స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ రుద్ర పారాయణం చేశారు. మిడతల రమేష్, పద్మావతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లోపు రైల్వే అండర్ బ్రిడ్జీలకు టెండర్లు

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాళెం, బీవీనగర్ రైల్వే గేట్ల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జికి జూన్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల వంతెన పనుల్లో పురోగతి వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో అనూష, ఎస్ఈ రామ్మోహన్‌రావు, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, రూరల్ నియోజకవర్గంలో ఈ నెల 15న ఏకకాలంలో రూ. 41 కోట్లతో కేవలం 60 రోజుల్లో నిర్మించిన 339 అభివృద్ధి పనులను ప్రారంభించబోతున్నామని ఆ జాతరకు తప్పక హాజరుకావాలని టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి శుక్రవారం మున్సిపల్ మంత్రి నారాయణను కోరారు. మంత్రితోపాటు కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, ఎన్ఎంసీ మేయర్ స్రవంతి, పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందచేశారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

నెల్లూరు(క్రైం), మే 9 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లమధ్య నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై బాలాజీనగర్ పోలీసులు దాడి చేసి నిర్వాహకులతోపాటు ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీనగర్‌లో మల్లికార్జున దంతపతులు నివసిస్తున్నారు. వారు కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాం బశివరావు తన సిబ్బందితో గురువారం అర్ధరాత్రి దాడిచేశారు. మల్లికార్జున దంపతులతోపాటు విటులు కోవూరు మండలానికి చెందిన శ్రీనాథ్, నిఖిల్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను హోమ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నెల్లూరు (హరనాథపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, డాక్టర్ సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున మాదాల గురవయ్య స్మారక ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తామని ఆ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 11న సాయంత్రం 4గంటలకు నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ కార్డులు, మార్కుల మెమోతో ఆరోజు సాయంత్రం 3.30గంటలకు హాజరుకావాలని కోరారు.

మూల్యాంకన నిధులు విడుదల చేయాలి

నెల్లూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ మూల్యాంకన నిధులను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం అందజేశారు. పదోన్నతుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు విడుదల చేయాలన్నారు. జిల్లాలో ఎస్‌జీటీ తెలుగు, ఉర్దూ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి పిచ్చిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించండి

నెల్లూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో విద్య, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలుగా పని చేస్తున్న తమను టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియకు చేయూతనివ్వాలని కోరుతూ నెల్లూరులోని సచివాలయ ఉద్యోగులు శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో టెక్నికల్ విభాగంలో అనేక పోస్టులున్నాయని, వాటిల్లో సహాయకులుగా తమను తీసుకోవాలని కోరారు.

నేదురుమల్లికి ఘన నివాళి

నెల్లూరు (వైద్యం), మే 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నగరంలోని ఇందిరాభవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి మాట్లాడుతూ నేదురుమల్లి సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందచేశారు. కోటేశ్వరరెడ్డి, ఏసునాయుడు, ఏటూరి శ్రీనివాసులురెడ్డి, సురేష్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో భారీ అవినీతి

● నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్ రఘు

నెల్లూరు (హరనాథపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు, ఉపాధి హామీ పనుల నిజ నిర్ధారణ కమిటీ జిల్లా కన్వీనర్ కొప్పోల రఘు ఆరోపించారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి కూలీల హక్కులపై నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధి హామీ అవినీతి అధికారులు, సిబ్బందిపై పోరాటం చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 37 మండలాల్లో జరిగిన ఉపాధి పనుల్లో 14 మండలాల్లో రూ.5కోట్లపైనే జిల్లా డ్వామా, ఎంజీఎన్ఆర్ఈజీఏ అధికారులు, సిబ్బంది, ఏపీడీ, ఏపీవోలు, ఎంపీడీవోల పరిధిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. నిజ నిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కమిటీ కో కన్వీనర్ మీదూరి కల్యాణ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి నిత్య కల్యాణం



బుచ్చి: నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

బుచ్చిరెడ్డిపాళెం,మే 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణం నిర్వహించారు. రాత్రికి సామూహిక కుంకుమార్చన, పల్లకిసేవ చేపట్టారు. వేడుకలో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి):నిడిముసలిలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంబాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొనగా నిడుముసలి సర్పంచ్ దువ్వూరు పావని, మధుసూదన్‌రెడ్డి దంపతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమలాకర్‌రెడ్డి, వంశీ కృష్ణారెడ్డి, చెంచుకిషోర్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బొద్దుకూరు సుధాకర్ ఉన్నారు.

● విడవలూరు, (ఆంధ్రజ్యోతి):పార్లపల్లిలో వెలసిన మహాలక్ష్మీ సమేత అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకి హనుమంత సేవ నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధరకాల పూలతో అలకరించి హనుమంతుని వా హనంపై ఊరేగించారు. ఉత్సవాలకు గ్రామానికి చెందిన రెడ్డి సామాజికవర్గం ఉభయకర్తలు వ్యవహరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.



విడవలూరు: హనుంతుడి వాహనంపై ఊరేగుతున్న అళఘునాథ స్వామి, అమ్మవారు

25లోగా దరఖాస్తు చేసుకోండి

వెంకటాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి):మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు మైనార్టీలు, ముస్లింలు, జైనులు, బౌద్ధిస్ట్, పార్శీవర్గాల లబ్ధిదారులు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కల్పన శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడు తప్పనిసరిగా ఏపీలో నివాసం ఉండాలని, మైనార్టీ వర్గానికి చెందిన వారై ఉండాలన్నారు. 21నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.5లక్షలు మించకూడ దన్నారు. లబ్ధిదారుడికి తప్పనిసరిగా ఆధార్, రేషన్‌కార్డులు కలిగి ఉండాలన్నారు. రవాణా రంగానికి సబ్సిడీ రుణాని కి దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. జనరిక్ మెడికల్ షాప్ సబ్సిడీ రుణానికి దర ఖాస్తు చేసుకునే వారికి తప్పనిసరిగా డీ ఫార్మసీ, బీ ఫార్మసీ సర్టిఫికెట్లు కలిగి ఉండాలన్నారు. ఈ నెల25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీహెచ్‌సీకి అదనపు హంగులు

● సీఎస్ఆర్ నిధులతో వివిధరకాల పరికరాలు ఏర్పాటు



ఐ.పేట: ప్రశాంతిరెడ్డికి స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

పొదలకూరు, మే 9(ఆంధ్రజ్యోతి):స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సౌకర్యార్థం సీఎస్ఆర్ రూ.94 లక్షల నిధులతో సెంబ్‌కార్ప్ కంపెనీ సమకూర్చిన పరికరాలను శుక్రవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి పరిశీలించారు. పొదలకూరు సీహెచ్‌సీ, డయాలసిస్ యూనిట్‌లో కలియతిరిగా రు. ప్రభుత్వం 5డయాలసిస్ యూనిట్లను మంజూరు చేయగా సీఎస్ఆర్ నిధులతో అదనపు 3యూనిట్లు ఏ ర్పాటు చేశామన్నారు. ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌తో పాటు ఈసీజీ మిషన్, 2పల్స్ మానిటర్‌లను సెంబ్‌కార్ప్ (ఎస్ఈఐఎల్) అందించామన్నారు. ప్రస్తుతానికి రూ.43లక్షలు విలువైన పరికరాలు అందజేయగా త్వరలో జనరేటర్, డెంటల్ ఎక్స్‌రే యూనిట్, వాషింగ్ మెషీన్, 7 కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, క్రష్టకార్ట్, 4ఫ్రీజర్‌లు, ఏసీలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, అజయ్ పాల్గొన్నారు.

● ఓపెన్ స్థలాలను పరిరక్షించాలి

పొదలకూరు (ఆంధ్రజ్యోతి):లేఅవుట్లలోని ఓపెన్ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదే అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. శుక్రవారం పొదలకూరు సత్యనారాయణ లే అవుట్ పబ్లిక్ పర్పస్ స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.4కోట్ల విలువైన స్థలానికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దొంగపత్రం సృష్టించి భూఆక్రమణకు ప్ర యత్నించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్య నాయుడు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, తలచీరు మస్తాన్‌బాబు, అరుణమ్మ, ఆశీర్వాదం, అమర్తలూరు చెంచయ్య పాల్గొన్నారు. అనంతరం మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు (ఆంధ్రజ్యోతి): సౌత్‌ఆములూరు కోడూరు నీటిపారుదల కాలువ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. రెండో పంటకు నీటిని పొదుపుగా వాడుకునేందుకు అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసరెడ్డి, కొణతం రఘు బాబు, చావ కోటయ్యనాయుడు, చావా రమేష్ బాబు, గుడ్లూరు గోపాల్ నాయుడు తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన విడవలూరు వైసీపీ నాయకులు

విడవలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వైసీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హూండ్ల అచ్యుత్‌రెడ్డితో పాటు దంపూరు, దండిగుంట, చౌకిచర్ల సర్పంచులు సురేంద్రరెడ్డి, బెల్లంకొండ సుప్రజ, అరగల వినోద్‌లు చౌకిచర్ల మాజీ ఎంపీటీసీ కొమ్మిరెడ్డి మురళీ రెడ్డి, అన్నారెడ్డిపాళెం బీసీ యువత మండలాధ్యక్షుడు శివకుమార్‌తో పాటు 300వందల మంది శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి నెల్లూరు వీపీఆర్ నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముడుపులు ఇచ్చి పార్టీలోకి తీసుకునే నీచమైన సంస్కృతి టీడీపీకి లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి అనేక మంది వైసీపీ నాయకులు పార్టీలోనికి చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం హూండ్ల అచ్యుత్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీకోసం పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి పాల్గొన్నారు.

● కొడవలూరు (ఆంధ్రజ్యోతి):పాతవంగల్లు వైసీపీ నాయకుడు గ్రామ సర్పంచ్ యుగంధర్ సింగ్ నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో ముంగమూరు శ్రీహరిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన వెంట కేతు వెంకటరమణారెడ్డి, మందిపాటి ప్రవీణ్‌కుమార్, గరికపాటి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.



సర్పంచ్ యుగంధర్ సింగ్

బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసమే 'కిశోరి వికాసం'

రాపూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): బాలికల ఉజ్వల భవిష్యత్తే కిశోరి వికాసం లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య తెలిపారు. శుక్రవారం వేసినాపి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో సౌజన్య మాట్లాడారు. 18ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేస్తే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళాపోలీస్ అనిత, టీచర్లు రమణమ్మ పాల్గొన్నారు.

● పొదలకూరు (ఆంధ్రజ్యోతి):మహమ్మదాపురం, వరదాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై వేసవి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 10వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా మూడోరోజు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్క కిశోరి బాలికలు 18ఏళ్లలోపు వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరం అన్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లు జరిగితే కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో వరదాపురం ఎంఎస్‌కే సీహెచ్ సౌజన్య, మహమ్మదాపురం ఎంఎస్‌కె శ్రీలత, ఏఎన్ఎం పెంచలయ్య, వీఏఏ రామలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, రోహిణి, శరణ్య, రాజేశ్వరి, ప్రమీల, భారతి పాల్గొన్నారు.

గుండెపోటుకు అత్యవసర చికిత్సపై అవగాహన

ఇందుకూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం గుండెపోటు అత్యవసర చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావాలంటీర్లు, వైద్య సిబ్బందితో సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, జైపాల్‌రెడ్డి, డాక్టర్ ప్రసన్న, మౌనిక, విజయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం) :పెన్నా బ్యారేజ్‌లో ఒకటి, రెండు పిల్లర్ల మధ్య నీటిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు గాంధీగిరిజన కాలనీ వార్డు సెక్రటరీ రమేష్‌బాబుకు సమాచారం అందించారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకుని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ప్రైవేటు'లో ఉచిత అడ్మిషన్లు

బుచ్చిరెడ్డిపాళెం,మే 9 (ఆంధ్రజ్యోతి):విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1)(సి) ప్రకారం 2025-26 విద్యా ఏడాదిలో అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలోని 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎంఈఓ దిలీప్ కుమార్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లను కేటాయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 19వరకు దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. వివరాలకు బుచ్చి విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

13న జాబ్ మేళా

బుచ్చిరెడ్డిపాళెం, మే 9 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 13న బుచ్చిరెడ్డిపాళెం సిద్దార్థ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. మేళాలో 21ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు.

వివాహితను వేధించిన ఘటనలో | 'ఎర్ర' టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐపై కేసు

తిరుపతి(నేరవిభాగం), మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఓ మహిళను వేధించిన ఘటనలో రెడ్ శాండల్ రిజర్వ్ ఎస్ఐ విశ్వనాథ్‌పై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి ఎస్ఐ లోకేశ్ కథనం మేరకు.. రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్‌లో రిజర్వు ఎస్ఐగా విశ్వనాథ్ పనిచేస్తున్నాడు. అతడి స్నేహితుడి చెల్లెలి వెంట పడుతూ రెండు సంవత్సరాలుగా వేధిస్తున్నాడు. ఈ విషయం తెలిసి ఆమె భర్త అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హై అలర్ట్





తిరుమలలో ఏరియా డామినేషన్ కార్యక్రమంలో తనిఖీలు

దేశ సరిహద్దులో.. పాక్‌తో ఉద్రిక్తత నేపథ్యంలో జిల్లాలో భద్రత పెంచారు. తిరుమలలో భద్రతా బలగాలు శుక్రవారం సాయంత్రం ఏరియా డామినేషన్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టాయి. ఇక, రేణిగుంట విమానాశ్రయం, శ్రీహరికోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను హై అలర్ట్ జోన్ కిందకు తీసుకొచ్చి భద్రత పెంచారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



డాక్టర్ డీఎం ప్రేమావతి (ఫైల్ ఫొటో)

సాహితీవేత్త ప్రేమావతి కన్నుమూత

- పద్మావతి డిగ్రీ కాలేజీ తొలితరం తెలుగు అధ్యాపకురాలిగా విశేష కృషి
- పలువురి సంతాపం, నేడు అంత్యక్రియలు

సాహిత్యవేత్త, పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం అధ్యాపకురాలు డీఎం ప్రేమావతి(83) కన్నుమూశారు. సోమవారం ఉదయం అస్వస్థతకు గురైన ఆమె స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆఖరి శ్వాస విడిచారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం నంగమంగళం ఈమె పుట్టిన ఊరు. ఆడపిల్లలకు చదువెందుకు అనే రోజుల్లో ఊరుదాటి విద్యాభ్యాసం చేశారు. దాశరధి రంగాచార్య నవలలపై పీహెచ్‌డీ చేసిన ప్రేమావతి 1965లో పద్మావతి కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా చేరారు. 2000లో రీడర్‌గా రిటైరయ్యారు. ఈమె గురువు పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తి 104 ఏళ్ల వయసులో ఇటీవలే మరణించారు. ప్రేమావతి రాసిన ఆచార్య జీఎన్ రెడ్డి జీవిత చరిత్రను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. పద్మావతి కళాశాలలోనే చదువుకుని, అక్కడే బోధన చేసి రిటైరైన ప్రేమావతి తన అనుభవాలను 'నేనూ- నా కళాశాల' పేరుతో ఒక పుస్తకాన్ని రాశారు. సాహిత్య సభల్లో ఆమె ఉపన్యాసాలు విశేషంగా ఆకట్టుకుంటాయి. ప్రేమావతి మరణంతో ఆమె శిష్యులు, సాహిత్యకారులు, విద్యావేత్తలు విషాదంలో మునిగిపోయారు. బైరాగిపట్టెడ పార్క్ సమీపంలోని ఆమె స్వగ్రహం వద్ద అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ఉంచారు. శనివారం ఉదయం 10 గంటలకు గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

తోటి వేషం వేసి.. గంగమ్మను దర్శించి

పిల్లలు ఒళ్లంతా బొగ్గుపొడి పూసుకున్నారు. తెల్లనామం సాది కనుబొమ్మలపైన చుక్కబొట్లు పెట్టుకున్నారు. నడుంచుట్టూ, తలకు వేపాకు మండలను కట్టుకున్నారు. ఇలా శుక్రవారం తిరుపతి గంగజాతరలో తోటి వేషధారణతో అమ్మవారిని మొక్కుకున్నారు. పలువురు చిత్ర విచిత్ర వేషాలు ధరించారు. ఇక, సాయంత్రం 4 గంటల నుంచి భక్తుల రద్దీ పెరిగింది. ఇక, వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు శనివారం సాయంత్రం టీటీడీ తరపున సారె అందించనున్నారు. అలాగే, శనివారం దొర వేషాన్ని కైకాల, చాకలి కులస్థులు అనువంశికంగా వేస్తారు. ఈ వేషాన్ని ఇతరులెవరూ వేయరు. తక్కిన భక్తులు పలు రకాల వేషాలతో అమ్మవారిని దర్శించుకుంటారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి







ఆర్మీకి విరాళాలివ్వండి

- సైబర్ నేరగాళ్ల మెసేజీలు
- నమ్మి మోసపోవద్దంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు 'ఆపరేషన్ సిందూర్'నూ వదల్లేదు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితులను సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. తాము ఆర్మీ అధికారులమని, ఆర్మీకి విరాళాలు ఇవ్వాలంటూ పలువురికి మెసేజీలు పంపుతున్నారు. వీటిని ఎవరూ నమ్మొద్దని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ తరహా సైబర్ మోసాల గురించి తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రభుత్వం, ఆర్మీ అధికారులు, సైనికులు విరాళాలు అడగరని, ఎవరూ ఇలాంటి లింకులు టచ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఏపీకె ఫైల్స్'ను ఓపెన్ చేయొద్దన్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోను కాల్స్. మెసేజీలు వస్తే స్పందించవద్దని హితవు పలికారు. యూపీఐ చెల్లింపులు చేయొద్దన్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకుంటే సైబర్ నేరగాళ్లు దోచేస్తారన్నారు. ఇలాంటి వాటిపై 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంజనీరింగ్ ఎక్సలెన్స్ కోసం

కియా, ఐఐటీ వ్యూహాత్మక ఒప్పందం

ఏర్పేడు, మే 9(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌ను ముందుకు తీసుకెళ్లడానికి, సాంకేతిక ఆవిష్కరణలను నడిపించడానికి వ్యూహాత్మక అవగాహన ఒప్పందంపై కార్ల తయారీ సంస్థ అయిన కియా ఇండియా, తిరుపతి ఐఐటీ శుక్రవారం సంతకం చేశాయి. ఇంజనీరింగ్ ఎక్సలెన్సును, పరిశోధన నేతృత్వంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను పెంపొందించడం లక్ష్యంగా ఈ ఎంవోయూ కుదిరింది. తిరుపతి ఐఐటీలో మౌలిక సదుపాయాలు, సహకార పరిశోధన కార్యక్రమాల అభివృద్ధికి కియా ఇండియా ఐదేళ్లకు రూ.35కోట్ల పెట్టుబడిని పెట్టింది. కియా ఇండియాలో వృత్తిపరమైన వృద్ధికి విద్యార్థులకు అర్థవంతమైన అవకాశాలను అందించడం వంటివి ఉన్నాయని అధికారులు తెలిపారు. అర్హులైన ఎంటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఆర్థిక సాయం అందించనున్నట్లు ఐఐటీ అధికారులు తెలిపారు. తిరుపతి ఐఐటీలో మేకర్స్ క్రాస్- డిసిప్లినరీ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి లేబోరేటరిని సృష్టించడం ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశమన్నారు. ఐఐటీతో చేతులు కలపడం స్థిరమైన పారిశ్రామిక తయారీలో పురోగతికి మంచి అవకాశమని కియా ఇండియా ఎండీ, సీఈవో గ్వాంగు లీ అభిప్రాయపడ్డారు. విద్యా సంస్థ, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం, ఇంటర్న్‌షిప్‌లు, స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రతిభను వెలికి తీయడానికి ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్మంలో వైస్ ప్రెసిడెంట్, హెచ్ఆర్ అండ్ అడ్మిన్ గ్రూప్ 2 హెడ్ జాంగ్యాన్ సియో, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్ డాంగ్‌లీ, ప్రొఫెసర్ శశిధర్ గుమ్మా, డీన్ వెంకటరమణ బదర్లా, డాక్టర్ వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుంటున్న అధికారులు

పంచాయతీల వర్గీకరణకు కసరత్తు

- 16న ప్రభుత్వానికి నివేదిక

తిరుపతి(కలెక్టరేట్), మే 9(ఆంధ్రజ్యోతి): జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీల వర్గీకరణకు కసరత్తు మొదలైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలను నాలుగు విభాగాలు విభజించి.. గ్రేడ్‌ను బట్టి అర్హులైన వారిని కార్యదర్శులను నియమించాలని జీవోలో పేర్కొంది. ఆ ప్రకారం జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి 16వ తేదిలోపు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ సూచించారు. దీంతో పంచాయతీల వర్గీకరణకు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం రాత్రి కమిటీని నియ మించి కసరత్తు ప్రారంభించారు. కేటగిరీల వారీగా పంచాయతీలను విభజించి 13వ తేదీ లోపల ప్రతిపాదనలను పంపించాలని డీపీవో సుశీలాదేవిని ఆదేశించారు.

స్పెషల్ గ్రేడ్: వార్షికాదాయం రూ.కోటి మించినా లేదా పది వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు ఈ విభాగంలో ఉంటాయి. వీటికి డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీర్డీ) స్థాయి అధికారులను పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తారు. జిల్లాలో స్పెషల్ గ్రేడ్ కింద 14 పంచాయతీలు చేరనున్నాయి.

గ్రేడ్-1: నాలుగు వేల నుంచి 10 వేల జనాభా లేదా వార్షికాదాయం రూ.50లక్షల నుంచి రూ.కోటి ఉన్నా.. లేదా ఆ పంచాయతీకి హెడ్‌క్వార్టరుగా మండల కేంద్రం ఉంటే గ్రేడ్-1గా పరిగణిస్తారు. దీని పరిధిలో సుమారు 60 పంచాయతీలు రానున్నాయి.

గ్రేడ్-2: ఇందులో 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉండే పంచాయతీలు చేరనున్నాయి. ఇలాంటివి 141 పంచాయతీలు ఉన్నాయి.


గ్రేడ్-3: జనాభా రెండు వేలలోపు ఉండే పంచాయతీలన్నీ గ్రేడ్-3 కింద పరిగణిస్తారు. జిల్లాలో 572 పంచాయతీలు దీని కింద రానున్నాయి. స్పెషల్ మినహాయించి మిగతా పంచాయతీలకు నిబంధనల ప్రకారం కార్యదర్శులను నియమించనున్నారు. గిరిజన పంచాయతీలకు షరతులు వర్తించకుండా ప్రామాణికంగా తీసుకోనున్నారు.

జిల్లాకు 15మంది పంచాయతీ కార్యదర్శుల రాక

రాష్ట్రంలో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి గ్రేడ్-2గా పదోన్నతి కల్పించి వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా రాయలసీమ జిల్లాల్లో పదోన్నతి పొందిన వారిలో 15 మందిని జిల్లాకు కేటాయించారు. వీరిలో.. చిత్తూరు నుంచి లోకముని, కడప నుంచి కె.సుధీర్, సుధాకర్, సురేష్‌కుమార్, సుబ్బరాయుడు, కర్నూలు నుంచి ఎలిజిబెతమ్మ, గిరిధర్, గులాం జమిలాబీ, వెంకట్రాముడు, కోట మునెయ్య, కృష్ణ, అయ్యపురెడ్డి, వెంకటేశ్వర్లు, ఎం.కుమార్, అనంతపురం నుంచి సురేష్‌బాబు ఉన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రెండు మూడురోజుల్లో వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు డీపీవో సుశీలాదేవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నివాళి

వెళ్లిపోయిన ప్రేమమూర్తి



పద్మావతి కళాశాల తొలితరం అధ్యాపకురాలు ప్రేమావతి మృతితో శోక సంద్రంలో స్నేహాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఒక తరం సాహిత్యవేత్త వెళ్లిపోయారు. పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం విద్యార్థి, అధ్యాపకురాలు కూడా అయిన డాక్టర్ డీఎం. ప్రేమావతి మరణం ఆమె శిష్యులనూ, సాహిత్యకారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం నంగమంగళంలో 1942లో పుట్టిన ప్రేమావతి ఊరుదాటి చదువుకోవడమే ఆ కాలపు విచిత్రం. వీరికి తాతయ్యే కేఎం.రెడ్డి ఇందుకు కారణం. పై స్కూల్ ఫైనల్ తర్వాత చదువులకు తండ్రి అంగీకరించకపోవడంతో తల్లి నగలు దొంగలించి, ఆ డబ్బులతో రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్‌లో చేరారు. ఆ తర్వాత స్వంత ఊరికి తిరిగి వచ్చి బొమ్మసముద్రంలో పాక వేసి 1948లో బడి తెరిచారు. ఊరూరికీ తిరిగి పిల్లల్ని చేర్పించారు. ముఖ్యంగా ఆడపిల్లల చదువుల మీద ఆయన పెట్టిన శ్రద్ధతో ఆరేళ్ల ప్రేమావతి కూడా 1948లో బొమ్మసముద్రం బడిలో చేరారు. స్కూల్ ఫైనల్ తప్పితే పెళ్లి చేసేస్తామని ఇంట్లో బెదిరించడంతో ఆమె చదువే జీవితంగా గడిపారు. 1952లో తిరుపతిలో ప్రారంభమైన పద్మావతి కళాశాలలో 1958లో పదహారేళ్ల ప్రేమావతి పీయూసీ విద్యార్థిగా చేరారు. ఆ తొలి మెట్టే ఆమె అంతిమ లక్ష్యంగా మారింది. పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీమూర్తికి ప్రియశిష్యురాలిగా మారారు. డిగ్రీ పూర్తి అయ్యాక ఆచార్య జీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో ఎస్వీయూలో పీజీ చేశారు. ఆయన పర్యవేక్షణలోనే దాశరధి రంగాచార్య నవలల మీద పీహెచ్‌డీ చేశారు. రాజేశ్వరీ మూర్తి పట్టుదల వల్ల 1965లో తనకు విద్యాభిక్ష పెట్టిన పద్మావతి కళాశాలలోనే అధ్యాపకురాలిగా చేరారు. వందలాది మంది విద్యార్థులను ప్రభావితం చేశారు. ఆడవాళ్లకు చదువు అవసరం గురించి పదేపదే చెప్పేవారు. స్వతంత్రంగా జీవించమని అనేవారు. ఆమె శిష్యులు పలువురు వివిధ హోదాల్లో ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉన్నారు.

సాహిత్యవేత్తల సాన్నిహిత్యం : ప్రముఖ సాహిత్యవేత్తలు కెవి రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వకుళభరణం రామకృష్ణ, లలిత, ఆచంట శారదాదేవి, జానకీరాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మధురాంతకం రాజాం, పులికంటి కృష్ణారెడ్డి, ఆచార్య పీసీ నరసింహారెడ్డి తదితరులతో సన్నిహితంగా మెలిగారు. తిరుపతిలో జరిగే సాహిత్య సభల్లోనూ, పద్మావతి కాలేజీ సభల్లోనూ ఆమె కనిపించేవారు. తాను చదువుకున్న పద్మావతి కళాశాల అన్నా, ఆ కళాశాలకు రూపం ఇచ్చిన రాజేశ్వరీ మూర్తి అన్నా ప్రేమావతికి ప్రాణం. ఈ ప్రస్తావన లేకుండా ఆమె మాటలు సాగేవి కాదు. రాజేశ్వరీ మూర్తి పుట్టిన రోజులను క్రమం తప్పకుండా జరిపేవారు. ఆమె విద్యారంగానికి చేసిన సేవల గురించి వ్యాసాలు రాసేవారు. 104 ఏళ్ల వయసులో తన గురువు రాజేశ్వరీ మూర్తి అమెరికాలో ఇటీవల కన్నుమూయడంతో ప్రేమావతి బాగా దుఃఖించారు. ఒంటరిగా జీవిస్తూనే కన్నుమూసిన ప్రేమావతి తన ఇంట్లో అద్దెకున్న ఈశ్వరి, ఆమె ఇద్దరు కుమారులనే తన కుటుంబంలా మార్చుకున్నారు. నా కోడలు, నా మనుమలు అని మురిపెంగా చెప్పుకునేవారు. ఆమె ఆఖరి శ్వాస దాకా వారు వెన్నంటే ఉన్నారు.

ప్రేమకు ప్రతిరూపం

ప్రేమావతి మరణంతో ఆమె స్నేహమాధుర్యాన్ని చవిచూసినవారంతా శోకతప్తులయ్యారు. ఆమె క్రమశిక్షణాయుతమైన జీవనశైలిని గుర్తు చేసుకుంటున్నారు. ఎప్పుడూ నలగని చీర, తలలో మల్లెపూలతోనే ఆమె కనిపించేవారు. 'మనుషుల పట్ల ఆమె ప్రేమాభిమానాలకు కొలతల్లేవు. ఆత్మవిశ్వాసానికీ, ఆత్మాభిమానానికీ ఆమె నిలువెత్తు సాక్ష్యంగా జీవించారు' అని ప్రసిద్ధ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ కృష్ణప్రశాంతి గుర్తు చేసుకున్నారు. 'ప్రేమకు ప్రతిరూపం ప్రేమావతి. తన మిత్రులు ఎవరు ఆనారోగ్యానికి గురైనా తల్లడిల్లిపోయేవారు. ఆమె లోటు స్నేహాభిమానాలు అందుకున్నవారికి ఎన్నటికీ తీరనిది' అని ప్రముఖ చిత్రకారిణి కిరణ్‌కుమారి వ్యాఖ్యానించారు. 'ఆమె ఉత్తమ అధ్యాపకురాలు, భాషా, సాహితీ సేవకురాలు. విద్యారంగానికి మేలుబంతి' అని సాకం నాగరాజ అన్నారు. ' వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రేమావతి మరణం పెద్ద లోటు' అని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్ అన్నారు. గార్లపాటి దామోదర నాయుడు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, రాఘవ, మల్లారపు నాగార్జున, ఓ.వెంకటరమణ, కష్టవేణిశైలకుమార్, తీట వెంకటేశ్వర్లు, యువశ్రీ మురళి వంటి ఎందరో సంతాపం తెలిపారు. పద్మావతి కాలేజీలో సంతాప సభ నిర్వహించారు. పద్మావతి కాలేజీకి ప్రేమావతి అందించిన సేవలను పద్మావతి జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు భువనేశ్వరీదేవి, నారాయణమ్మ కొనియాడారు.

పాక్ కవ్వింపు చర్యలకు దీటుగా బదులిస్తున్నాం

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

తడ, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు, దాడులకు దీటుగా బదులిస్తున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన మధుసూదన్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించేందుకు నెల్లూరు జిల్లా కావలి వెళుతున్న కేంద్ర మంత్రికి బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడి ప్రసన్న ఆంజనేయస్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పహల్గాం దాడికి పాల్పడ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పేందుకు 'ఆపరేషన్ సిందూర్' చేపట్టామన్నారు. దీన్ని భరించలేని పాక్ కవ్వింపు చర్యలకు దిగుతూ సరిహద్దుల్లో దాడులకు పాల్పడుతోందన్నారు. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు దేశం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయా కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఆదినారా యణరెడ్డి, కిషన్‌రెడ్డి, కృష్ణమూర్తి, కోటి ఆచారి, మునికృష్ణయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

చిల్లకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి పూజలు జరిపారు. తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. చేవూరు శేషయ్య, పవిత్ర, సర్వేపల్లి బాలసుబ్రహ్మణ్యం, జయంతి, ఉడతా శ్రీనివాసులు, సుభాషిణి, నెల్లూరు అచ్చెయ్య, మంగమ్మ, ఉడతా వెంకటేశ్వర్లు విజయమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జీఎస్‌టీ రోడ్డులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకం జరిపాక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన హోమగుండంలో హోమం నిర్వహించారు. మధ్నాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చిట్టేటి పెరుమాల్, చిట్టేటి విజయకుమార్, బట్టా సుబ్రహ్మ ణ్యం, చెంగయ్య, నూలేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కరిమాణిక్యస్వామి ఉత్సవాలు

నాయుడుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అవుతాయని టీటీడీ ఇన్‌స్పెక్టర్ హరి తెలిపారు. 10వ తేదీ శనివారం అంకురార్పణ, 11న ధ్వజారోహణం, 12న హనుమంతవాహన సేవ, 13న ద్వార దర్శనం, 14న హంస వాహనం, 15న చంద్రప్రభ వాహనం, 16న కల్యాణోత్సవం, 17న రథోత్సవం, 18న పార్వేట ఉత్సవం, 19న ధ్వజావరోహణం, 20న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

మాతమ్మకు విశేష పూజలు



తపస్సుమానుకు పూజలు చేస్తున్న భక్తులు

చిల్లకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మాతమ్మ కొలుపులో భాగంగా శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. ఆలయం వద్ద పరుశురాముడి ముగ్గు, జమదగ్ని తపస్సు, వణం కొరుకుట, కార్తీక యుద్ధ సన్నివేశాలను నిర్వహించారు. సాయంత్రం తపస్సుమానుకు పూజలు నిర్వహించారు. అనంతరం మాతమ్మను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

నేదురుమల్లి జనార్దన రెడ్డికి నివాళి

వాకాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న జనార్దనరెడ్డి విగ్రహానికి ఆయన తన యుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు మేరిగ మురళీధర్, విక్రమ్‌రెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని మన్నెముత్తేరి, మంగానెల్లూరు, దేగవారికండ్రిగ, అట్టకానితిప్ప సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్నాహ్నం 1:30 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పూర్ణిమ తెలిపారు. అదేవిధంగా సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేట, షార్ జంక్షన్, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, చెంగాళమ్మ ఆలయ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, జీఎస్‌టీ రోడ్డు, బాపూజీ వీధి, కచ్చేరివీధి, వనంతోపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ మోహిని తెలిపారు.

తడ: మండలంలో సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండని ఏఈ మురళి తెలిపారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పెళ్లకూరు, ఓజిలి, మే 9(ఆంధ్రజ్యోతి): కొత్త రేషను కార్డుల కోసం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలని పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఓజిలి ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. కొత్త కార్డులతో పాటు సభ్యుల చేరిక, తొలగింపు, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ సరిదిద్దడం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



నెర్రికాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు - సూళ్లూరుపేట పట్టణం వినాయకుడి గుడి సమీపంలో కాలువలో వ్యర్థాలు

అటకెక్కిన నెర్రికాలువ ఆధునికీకరణ పనులు

సాగునీరందక అన్నదాతల ఆందోళన

సూళ్లూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాల రైతులకు వరప్రసాదిన అయిన నెర్రికాలువ ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. దీంతో పొలాలకు సాగురందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు మండలాల పరిధిలో 17.5 కిలో మీటర్లు విస్తరించి ఉన్న నెర్రికాలువ ద్వారా 18 చెరువుల కింద 19వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. అలాగే సూళ్లూరుపేట పట్టణ దాహార్తి తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నెర్రికాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నింపి తాగునీరందిస్తున్నారు. అంతటి ప్రాధాన్యం కలిగిన నెర్రికాలువను దొరవారిసత్రం మండలం తనియాలి వద్దనున్న ఆనకట్ట నుంచి వాటంబేడు వెళ్లే మార్గంలో ఉన్న సూళ్లూరుచెరువు వరకు దాదాపు 11 కిలో మీటర్ల మేర ఆక్రమణలు తొలగించి కాలువకు ఇరువైపులా సిమెంట్ లైనింగ్ పనులు చేసి ఆధునికీకరించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం రూ.27.19 కోట్లు కేటాయించింది. అప్పటి ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. తమది రైతు ప్రభుత్వమని, మూడు నెలల్లో నెర్రికాలువ గుండా పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లింపులో జాప్యం చేయడంతో కనీసం 20 శాతం కూడా పూర్తి చేయలేదు. దొరవారిసత్రం మండలంలో రెండు కిలో మీటర్లు, సూళ్లూరుపేట మండలంలో అర్థ కిలోమీటరు మేర పనులు చేసి ఆపేశారు. ఈ విషయాన్ని రైతులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదు. బాగున్న కాలువను ఆధునికీకరణ పేరుతో తవ్వేయడంతో వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నెర్రికాలువ ఆధునికీకరణ పనులు పునఃప్రారంభించి సాగునీరు అందిస్తుందని కొండంత ఆశతో ఎదురుచూశారు. అయితే 20శాతం లోపు జరిగిన పనులను నిలిపివేయాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో రైతుల ఆశలన్నీ అడియాశలు అయ్యాయి. సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నెర్రికాలువ పనులను చేయాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు నియోజకవర్గంలో బోర్లు, మోటార్లు మరమ్మతులకు గురైై ఉంటే వాటిని త్వరతగతిన బాగు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

13 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

వెంకటగిరి టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కల్పించడం కోసం ఈనెల 13 నుంచి టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభిస్తారని ఎంపీడీవో కోటీశ్వరరావు తెలిపారు. మొదటి విడతలో మండలంలోని 120 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు.

వసతి గృహాల అభివృద్ధికి నిధులు మంజూరు

కోట, మే 9(ఆంధ్రజ్యోతి): కోటలోని వసతిగృహాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు బీసీ వసతిగృహాల డీఈ రమేష్, ఏఈ మున్నార్ తెలిపారు. కోట, చిట్టేడులోని బీసీ వసతి గృహాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. కోటలోని బీసీ వసతి గృహానికి రూ.17.5 లక్షలు, చిట్టేడు వసతి గృహానికి రూ.15లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులను చేపడుతామని చెప్పారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మల్లికార్జున దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పకుండా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్, సుబ్బారావు, ఇబ్రహీం, రజినీకాంత్, సుమన్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

వాకాడు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో విద్యా ర్థులకు బాల్య వివాహాలకు నిర్మూలనపై అంగన్‌వాడీ సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని అన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల బాలికల రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించడంతో పాటు వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుంద న్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చిన్నమ్మ, ఏఎన్ఎం నాగమణి, మహిళా పోలీసు అమరావతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పెళ్లకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): సినీ కథానాయిక సాయిపల్లవి పుట్టినరోజు సందర్భంగా ఆమె అభిమానులు శుక్రవారం నాయుడుపేటలోని చేయూత చిన్న పిల్లల ఆశ్రమం, మేరీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయప్రకాశ్, దిలీప్, వెంకీ, ప్రసాద్, గిరి, వంశీకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించండి



రైల్వే జీఎం ఆర్ఎన్ సిన్హా, డీఆర్ఎం విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. శుక్రవారం ఆమె చెన్నై సదరన్ రైల్వే డివిజన్ జీఎం ఆర్ఎన్ సిన్హా, డీఆర్ఎం విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయుడుపేట సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాఘవన్, పేర్నాటి జోషఫ్, కంకిపాటి కిరణ్‌కుమార్, నాగ్రేంద్ర, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి పూజలు

గూడూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌రోడ్డులో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం విశిష్టపూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రాహుకాల పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్‌బీకేఆర్‌లో సృజన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిధిలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సృజన 2కే 25 జాతీయ సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు 150 పేపర్ ప్రజెంటేషన్లు సమర్పించారు. ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు వెళ్తే హేళన చేస్తున్నారు

సర్పంచు, కార్యదర్శి ఎదుట కార్మికుల ఆవేదన



సర్పంచు, కార్యదర్శి ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కోట, మే 9(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ కోసం ఇంటింటికీ వెళుతుంటే హేళనగా మాట్లాడుతున్నారని, ఆత్మగౌరవం చంపుకుని పారిశుధ్య పనులు చేయలేమంటూ సర్పంచు వెంకటరమణమ్మ, కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు నల్లప్పరెడ్డి వినోద్‌రెడ్డి ఎదుట పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచు, కార్యదర్శులను కలిసి చెత్త సేకరణ సందర్భంగా వారికి ఎదురవుతున్న అవమానాలను వివరించారు. అంటురోగాలను లెక్కచేయకుండా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేస్తూ మురుగు, వ్యర్థాలను బయటకు తోడేస్తుంటే ఆదరించాల్సిన గ్రామస్తులు అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైే ఆత్మగౌరవం చంపుకుని పని చేయలేమని చెప్పారు. సర్పంచు వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఎంపీపీ వినోద్‌రెడ్డి మాట్లాడుతూ వార్డుల వారీగా నివాస గృహాల యజమానులతో చర్చించి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూస్తామని భరోసా ఇవ్వడంతో కార్మికులంతా విధుల్లోకి వెళ్లారు.

భారత సైన్యానికి న్యాయవాదుల సంఘీభావం



భారత ఆర్మీకి సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం చేపట్టిన సాహసోపేత పోరుకు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచుకిష్టయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు భారత ఆర్మీకి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దశయ్య, గంగాప్రసాద్, కిషోర్, పసల చెంగయ్య, శ్రీనివాసులు, రమణయ్య, సురేష్, నారాయణ, లిఖిత చౌదరి, మాధవి, నిత్య, పరశురామయ్య, మోహనకృష్ణ, చిరంజీవి, వంశీ, రఫీ, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం

కోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెంలో గ్రామదేవత గంగమ్మ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలు పూర్తయ్యే వరకు దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా, అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులు పొలిమేరల్లో వేపమండిలతో తోరణాలు కట్టి దిష్టి తీర్పులు చేశారు. అనంతరం మేళతాళాలతో సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ అమ్మవారికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



పొలిమేరల్లో దిష్టితీర్పు చేస్తున్న గ్రామస్తులు